శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!



‘అనుగ్రహ పూర్ణుని పుష్కర ఆరాధన’

# గురుకృప

12వ ఆరాధనోత్సవ సంచిక



## బాబాను బాబాగా చూడటం

**గురుబంధువు :** సార్! మీరు చెప్పేది ప్రతిదీ చాలా సులభంగా, అర్థమయ్యే భాషలో చెప్తుంటారు. బహుశా కొన్ని కొన్ని లీలలను మేము అర్థం చేసుకునే క్రమంలో క్లిష్టంగా చేసుకుంటుంటాం సార్. అర్థం కాకపోవడానికి కారణం అది.

**గురువుగారు :** అందుకనే, నేను చెప్పేది వేదాంతం కాదని చెప్పింది. "Vedanta is making simple things complex" అని ఎవరో చెప్పారు. My way is to make complex things simple. నిజానికి అవి సింపులే. అవేమీ పెద్దగా లేవక్కడ. కానీ అంత సింపుల్ కూడా కాదు. మన Complexity ఎక్కడనుంచి వస్తుందంటే అవసరం లేని దగ్గర Interpretations ఇవ్వడంలో వస్తోంది. ఎలా కూర్చున్నా, ఆయన బాబా. మనకు ఇంతకుముందు మనం చదువుకున్నటువంటి వేదాంతము, యోగము, ఈ ముద్రలూ ఇవన్నీ బాగా బుర్రకెక్కి, బాబాను కూడా ఈ రకంగా Interpret చేయడానికి ప్రయత్నం చేస్తాం. Interpret చేసి, దాన్ని లైక్ చేయడానికి ప్రయత్నం చేస్తాం. అంతే తప్పితే, బాబా మార్గంలోకి మనం పోవడం కాదు. మన మార్గంలోకి బాబాను తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తాం. ఆ ప్రయత్నాలు ఆపడానికే


*(తరువాయి 31వ పేజీలో)*

సంపుటి : 25
సంచిక : 5



ఆరాధనోత్సవ సంచిక
13 నవంబర్ 2022

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



4 పథగామి – గురుకృప
7 అర్థవంతమైన పూజ – సాయినాథుని శృతి
14 జగద్గురువు – మనోధ్యానం – గురుకృప
16 నివేదిత, గురుశిష్య సంబంధానికి ప్రతీక – గురుకృప
18 మహాత్ములకు మనమివ్వవలసిన నివాళి (ఆరతి) – గురుకృప
28 గురుకృపాలహరి – గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## దినచర్య - దైవచర్య

ప్రతి ఉదయం క్రొత్త జన్మ. ప్రెజెంట్‌లో ఉండాలి. అదే మనకు భగవంతుడు ఇచ్చిన ప్రెజెంట్ (బహుమతి). డోంట్ పోస్ట్‌పోన్–అన్న సూక్తిలోని రహస్యం, గుహ్యం, సులువు, మార్గం దర్శించామా? నిన్నటి పనులు ఏమీ మిగలకపోతే మరురోజు క్రొత్తరోజు. లేకపోతే నిన్న ఆపిన పని మొదలుపెట్టే నిన్నటిరోజు. అందుకే ఏ రోజు పని ఆరోజు, ఎప్పుడు చేయాల్సిన పనిని అప్పుడే చేయాలి అన్న మాటలలోని అంతరార్థం. ఈ అర్థం తెలుసుకొని, పాటించిన వారే సాధనలో ఉన్నవారు అవుతారు. లేకపోతే తెలిసిన వారవుతారు. ప్రతి ఉదయం క్రొత్త జన్మ అనే భావనతో సాగే దివ్యమైన సాధన. ఇది దైనందిన సాధనగా మారితే మనిషి జీవితం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. అప్పుడు దినచర్య దైవ(దివ్య)చర్యగా సాగుతుంది.

ప్రాతఃకాలము నిద్ర మేల్కొనగానే ఈ సాధన చేయడం ఆరంభించాలి అంటే నిన్నటివేవీ ఉండకూడదు. రేపు చేద్దాం అనుకునే మనకు రేపు ఉంటాం అని తెలుసా? అంటే సందేహమే కదా! ఇట్టి ఆలోచన ఎవరికీ వస్తుంది అంటే జీవితంపట్ల, దైవంపట్ల అవగాహన ఉన్నవారికే.

“ఈ జీవితం దేవుడు ఇచ్చిన వరం. ఎందుకు ఈ జీవితంలోకి వచ్చింది? సద్గురువుని తెలుసుకో” అన్నారు శ్రీసాయి. మన ఆలోచనలతో, ప్రవర్తనతో, చేతలతో మనల్ని దైవంగా ఎదిగించడానికే గురువు అన్న పూర్ణ అవగాహనతో గురువు చెప్పినవి పాటించేవారే వారి పథంలో ఉన్నవారవుతారు. ఈరోజు నేను క్రొత్త జన్మను పొందాను అన్న భావనతో సాధన ప్రారంభించాలి. ఈరోజే నాది కనుక నాకు లభించిన ఈ కాలమును ఎంతో శ్రేష్ఠమైనదిగా ఉపయోగించు కొనవలెను అని భావిస్తూ ఆనాటి దినచర్యను మొదలుపెట్టాలి.

తన లక్ష్యము, ఆదర్శము, ఉద్దేశ్యము, కుటుంబ బాధ్యతలు, సామాజిక కర్తవ్యములు ఇలా ఎన్నో అంశములు జీవితముతో ముడిపడి ఉంటాయి. వాటన్నింటిని కర్తవ్యతా భావముతో నిర్వర్తించేందుకు సిద్ధాంత భావజాలముతో బాధ్యతలు నిర్వహించాలి. సోమరితనము, బద్ధకముతో కాలమును వ్యర్థపరచు కోకుండా నిర్ణయించుకున్న లక్ష్యమును చేరుకునేందుకు శ్రద్ధ–సబూరిలను ప్రదర్శించాలి. పనులను వాయిదా వేయకుండా తక్షణమే చేసెయ్యాలి. ఎందుకంటే కాలచక్రము నిర్విరామముగా పరుగులు పెడుతూ ఉంటుందే తప్ప ఎవ్వరి కోసమూ లిప్తకాలంపాటు కూడా ఆగదు. శరవేగముతో



ముందుకుసాగే కాలము తన పనిని తాను చేసుకుంటూ పోతుంది. అటువంటి కాలప్రవాహములో మానవుడు సాగిపోతూ ఉంటాడు. కాలము ఆగదు కనుక తనకు లభించిన జన్మను సార్థక పరచుకొనుటకు యథాశక్తి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నమే బాబా వేయమన్న ఒక్క అడుగుగా ప్రతిరోజూ ఈ దివ్యమైన సాధన సాగాలి.

వర్తమానంలో వర్తిస్తూ ఉండటమే **flow with the flow, fall with the fall**. ఈ సాధన మొదలుపెడితే మానవుడికి ప్రతిక్షణము, ప్రతిరోజూ విలువైనదే అన్న భావన దృఢపడుతుంది. కాలమును వృథా చేసుకోకుండా సద్వినియోగపరచుకొని జీవిత గమనములో మున్ముందుకు సాగుతాడు. పక్కా ప్రణాళికతో తన బాధ్యతలను, కర్తవ్యములను నిర్వర్తించేందుకు ఈ సాధన ఇతోధికముగా సాయపడుతుంది (దీక్షిత్ జీవనమే మనకు ఉదాహరణ). అందుచేత సాధకులైన వారందరూ ఈ సాధన చేయాలన్న బోధ చరితార్థుల జీవనాలలో వ్యక్తం అవుతున్నది. వారి జీవితమంతా ఈ సాధనను దిగ్విజయంగా అమలు పరచి మనకు ఆదర్శంగా నిలిచారు.

గడిచిపోయిన ప్రతిరోజునూ పూర్తిగా మర్చిపోండి. మీరు చేయగలిగినది మీరు చేసారు. కొన్ని పొరపాట్లు నిస్సందేహంగా చోటుచేసుకొని ఉండవచ్చు. వాటిని ఎంత త్వరగా మర్చిపోగలిగితే అంత త్వరగా మర్చిపోండి. రేపొక క్రొత్త దినం దాన్ని చక్కగా ఆరంభించండి. గడిచిపోయిన విషయాలు చెత్తతో సమానం. వాటితో కృంగిపోనంత శక్తితో మీరు క్రొత్త రోజు ప్రారంభించండి.

పూజ్యగురుదేవులు తమ మాటలతో, ఆచరణతో, తన వారితో అందించిన ఈ మహత్తరమైన సాధనను ఆచరణలో పెడితే సమయం సదుపయోగమవటమే కాదు, సాధకుడు అభ్యున్నతి దిశలో ఉత్తమ స్థాయిని అందుకుంటాడు. అందుకే గురుపథం–ప్రగతిపథం, అభ్యుదయపథం అంటుంది శాస్త్రం.

**"గురువు చెప్పినట్లు చేయడం వలన వారి అనుగ్రహాన్ని అనుభూతి పొందగలం" అంటారు శ్రీబాబూజీ.** దీనికి మనకు వలసినవి ఏమిటో చూద్దాం. హబీబ్‌కు ఒక భక్తుడు సమర్పించిన విలువైన పోతును ఒకచోట విడిచి ప్రార్థన చేసుకోవడానికి దూరప్రాంతానికి వెళ్ళాడు. అటుగా పోతున్న



మీరందరూ కూడాను బాబా యొక్క తత్వాన్ని నేర్చుకోవాలి. బాబా పరంగా మీరు ఇంకా ఇంకా ముందుకు పోవాలి అని అంటే నాకు బాబాపట్ల ఉండేటటువంటి ప్రేమను మీతో పంచుకోవడానికి నేను ఇరవై నాలుగు గంటలూ సిద్ధమే.



హసన్‌బ్రస్రా దానిని చూచి, ఈ మూర్ఖుడికి దీని విలువ తెలియదు. అందుకే ఎవర్నీ కాపలా పెట్టకుండా ఇలా వదిలివెళ్ళాడు అనుకొని, అతను వచ్చేదాక దానికి కాపలా ఉన్నాడు. అతన్ని చూస్తూనే నీవు దానికి ఎవర్ని కాపలా ఉంచావు? అని అడిగితే మిమ్మల్ని సమయానికి ఇక్కడకు ఎవరు పంపారో వారిని" అన్నాడు హబీబ్. ఆనందంతో హబీబ్‌ని ఆలింగనం చేసుకొని! **ఈ విశ్వాసమే అసలైన కోట! ఈ శ్రద్ధే అసలైన కావలి** అన్నాడు హసన్‌బ్రస్రా. మనమందరమూ తెలిసిన వాళ్లమే. జ్ఞానం ఉన్న వాళ్ళమే. అంతటా అన్నిటా ఆయనున్నారు అన్నది తెలిసినవాళ్ళమే. కానీ దీనికి విశ్వాసం తోడు కావాలి. ఆ శక్తి మీకెలా వచ్చింది మాకెందుకు రాదు అని అడిగిన ఓ శిష్యునితో "మీరు కాగితాలను నలుపు చేస్తున్నారు, మేము హృదయాన్ని తెలుపు చేసుకుంటున్నాము" అన్నారు హసన్‌బ్రస్రా.

"బాబా ప్రతీ రోజూ మధ్యాహ్న భోజనం తరువాత నాణాలు రుద్దుతుండేవారు. ఇది నానాది, తాత్యాది అంటూ! నా భక్తులను పతనం కానివ్వను అన్నారు బాబా. బాబా చెప్పిందే శాసనం. మనమంతా ఆయన భక్తులం. మనం భయపడవలసిన అవసరం లేదు. అర్హత, అనర్హతలంటూ ఏమీ లేవు. నిజానికి చెప్పాలంటే మనమందరమూ యోగ్యత లేని వాళ్ళం. బాబా అనుగ్రహమనేది రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ సంతకం వంటిది. ఆ సంతకం ఈ కాగితాలను కరెన్సీ నోట్లుగా మారుస్తుంది. కానీ సమస్యేమిటంటే ఈ కాగితమంతా సిరా మరకలతో అలికేసి ఉంది. బాబా దాని మీద సంతకం చేసినప్పటికీ ఆ సంతకం మనకు కనిపించడం లేదు. ఆ కాగితాన్ని కాస్త తెల్లగా చేసుకుని, బాబా సంతకం పెట్టడానికి తగిన ఖాళీని చేసుకోవడమే మనం ఇప్పుడు చేసేది" అంటారు శ్రీబాబూజీ.

"నా యజమాని కడు ఉదారుడు. ఆయన్ను అడగాలంటే నాకే సిగ్గు వేస్తుంది. నిచ్చెన తెచ్చిన వాడికి రెండు రూపాయలు ఇచ్చిన ఉదారుడు. **సకాలంలో ఆయనే సహాయం చేస్తారు అన్న అవగాహనే విశ్వాసంగా నిలవాలి.** దీని కొరకు మహాత్ములు ఎన్నో లీలలు చూపారు. "బాబా ప్రతి లీలా ప్రబోధాత్మకమే" అంటారు శ్రీబాబూజీ. దీని నిరూపణ చూద్దామా! తాత్యా ఒకసారి ఒక మందు వేసుకోవాలి. కానీ దానికి అనుపానంగా అంజీరా పండ్లు అవసరమయ్యాయి. గ్రామంలో ఎంత విచారించినా ఆ పండ్లు ఎక్కడా దొరకలేదు. తర్వాత అతను దర్శనం కోసం సమాధి మందిరానికి వచ్చాడు. సరిగ్గా అదే సమయానికి బాబా దర్శనార్థం వచ్చిన బరోడా మహారాజ్-మహల్సాపతికి అంజీరా పండ్లు ఇచ్చి నివేదన చేయించారు. మహల్సా వాటిని తాత్యాకి ఇచ్చాడు.



**సృష్టిని మించిన మహాత్మ్యం లేదు... మహితతత్త్వానికి మహిమలతో పని లేదు.**

అక్కడక్కడి పువ్వులనేరి, మాలగా తయారు చేసి అందించడమే ఈ పథగామి పాత్రత. ఆ పూలు నావేనని ఎంత మాత్రం అనరు. **– గురుకృప**

## అర్థవంతమైన పూజ

పూజించడమనేది ప్రేమ యొక్క వ్యక్తీకరణ అని నాన్నగారు అంటారు, చాలా మంది తమ దైవాలను, మహాత్ములను లేదా ప్రకృతిని సైతం పూజించేటప్పుడు కొన్ని విధివిధానాలను అనుసరిస్తారు. వారు చేసే చిన్న చిన్న పనులు ఒక అనుభూతిని సూచిస్తాయి, ఓ భావోద్వేగాన్ని వ్యక్తపరుస్తాయి లేదా ఆ చిన్న పనులు వారి భావోద్వేగాల పరంగా విలువైనవిగా ఉంటాయి.

మా ఇంటిలో, మేము బాబా తాతయ్యను పూజిస్తాము. మేము పూజించుకునే విధానం చాలా సరళంగానూ, వ్యక్తిగతమైనదిగానూ ఉంటుంది. మా ప్రేమను వ్యక్తపరచుకోవడానికి బాబా, నాన్నగారితో అనుబంధం కలిగి ఉండటానికి మా అందరికీ మాకంటూ స్వంత మార్గాలు ఉన్నాయి. నిర్దేశించబడిన నియమాలు లేదా విధానాలు ఏవీ లేవు. ఈ వైవిధ్యంలో గొప్ప రమణీయత ఉంది. అది అత్యద్భుతం.

నాకు 17 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, నాన్నగారు నాతో తరచుగా హేతుబద్ధంగా ఆలోచించడం గురించి మాట్లాడేవారు. "ఎప్పుడూ నీ అనుభవాన్ని నమ్ము" అని నాన్నగారు అనేవారు. "ఉదాహరణకు, ఈ పండు చేదుగా ఉంటుందని ఎవరైనా చెబితే, ఆ మాటను యథాతథంగా తీసుకోవద్దు. దానిని నువ్వే అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. దాని రుచి చూసి తెలుసుకో, అంటూ ఒక్క క్షణం ఆగి, "నేను చెప్పినాసరే, నా మాటను నమ్మవద్దు! అది నా అనుభవం, నీది కాదు. నీకై నువ్వే తెలుసుకోవాలి!" అది నాకు చాలా అద్భుతం అనిపించింది! అన్ని విషయాలను నాకై నేను తెలుసుకోవాలని అర్థమయింది. కానీ, ఏ తండ్రి తన 17 సంవత్సరాల కుమార్తెను తన మాటను ఊరకే అంగీకరించవద్దని చెబుతారు! నేను చేసే ప్రతి చిన్న పని నాకు అర్థవంతంగా



ప్రతిరోజూ గుర్తుపెట్టుకోండి. ఉదయం లేవగానే మనం ఎందుకొచ్చాం
ఇక్కడకు? ఎక్కడున్నాం అసలు? ఎందుకోసం ఉన్నాం?
ఏం సాధించడానికి ఉన్నాం? సాధిస్తున్నామా? అని తరచి చూసుకోండి.



ఉండాలని నాన్నగారు పట్టుబట్టేవారు – నేను ధరించే బట్టలనుండి, నేను చదివే పుస్తకాలు లేదా నేను వినే సంగీతం వరకు! **మనం చేసే ప్రతి పనికీ ఒక అర్థం ఉండాలని చెప్పేవారు. చేసే పనిలో నేను అర్థాన్ని వెతుక్కోవడం కాదు, నాకు అర్థవంతంగా అనిపించిన పనులే చేయడం. నాన్నగారి విషయంలో ఇది ఇలానే ఉండటం నేను చూశాను. నాన్నగారు ఏమి చేసినా అది వారికి అర్థవంతంగా ఉండేది.**

ఒకసారి, బాబాను పూజించేటప్పుడు మనం చేసే పనుల గురించి నాన్నగారిని అడిగాను. ఇది మా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ. నేను దీన్ని జ్ఞాపకం చేసుకుంటూ రాస్తున్నాను కాబట్టి, ఈ సంభాషణలోని పదాలు నాన్నగారు యధాతథంగా ఉపయోగించలేదు, కానీ విషయం మాత్రం యదార్థం.

**శృతి :** మనం బాబా వద్ద దీపం ఎందుకు పెడతాం? దాని అర్థం ఏమిటి?

**నాన్నగారు :** బాబా తమ జీవిత పర్యంతం తమ పక్కన ఒక ధునిని ఉంచుకున్నారు. ధుని అంటే అగ్ని. దానిని ఆయన తమతో ఎందుకు ఉంచుకున్నారో ఎన్నడూ చెప్పక పోయినప్పటికీ, అన్ని వేళలా ధునిని తమ ప్రక్కనే ఉంచుకోవడాన్ని ఇష్టపడుతున్నారనేది చాలా సుస్పష్టం. బాబాకు తమ పక్కన అగ్ని ఉండటం ఇష్టం కాబట్టి, మన ఇంట్లో ధునిని ఉంచుకోవడం కష్టమనే విషయం మనకు తెలుసు కాబట్టి, ధునికి ప్రతీకగా బాబా దగ్గర ఒక చిన్న దీపం పెడతాము.

**శృతి :** తమ పక్కన ధుని ఉంచుకోవడాన్ని ఆయన ఎందుకు ఇష్టపడ్డారు?

**నాన్నగారు :** మనకు తెలియదు, కానీ చాలా మంది సూఫీ సాధువులు అలా చేస్తారని తెలుసు.

**శృతి :** సరే మనం అగర్‌బత్తీని ఎందుకు వెలిగిస్తాం? దాని ప్రాముఖ్యత ఏమిటి?

**నాన్నగారు :** అదీ దీపం వంటిదే. బాబా ఎంతగానో ఇష్టపడిన ధునిని సూచిస్తుంది. కానీ చాలా మంది పూజా స్థలాన్ని పరిమళభరితంగా చేయడానికి కూడా దాన్ని ఉపయోగిస్తారు. ఆ అగరబత్తీ పరిమళం పూజతో ముడిపడి వుంటుంది కాబట్టి అలా చేస్తారు. ప్రార్థన లేదా ధ్యానం అనే మానసిక స్థితికి చేరుకోవడానికి ఆ పరిమళం వారికి సహాయకరంగా ఉంటుంది. పావ్‌లోవ్ క్లాసికల్ కండిషనింగ్ లాగా.

**శృతి :** అలాంటప్పుడు దీపం మరియు అగరబత్తీ రెండూ ఎందుకు? మనం ఒక్కటి వాడితే సరిపోతుంది కదా?



**నాన్నగారు :** మనం అలాగైనా చెయ్యవచ్చు! నీకు ఏది కావాలో అది పెట్టుకోవచ్చు..

**శృతి :** పువ్వులు మరియు పూలమాలల విషయం ఏమిటి?

**నాన్నగారు :** అది కేవలం మన ప్రేమ యొక్క వ్యక్తీకరణ మాత్రమే. మనతో సహా అనేక సంస్కృతుల్లో, పువ్వులను స్వాగతించడానికి, గౌరవించడానికి, కృతజ్ఞతలు చెప్పడానికి లేదా అనేక రకాలైన భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి ఉపయోగిస్తారు. మనం సాయియానాలో ఉన్నప్పుడు నాకు పూలమాలలు ఎలా వేసేవారో నీకు గుర్తుందా? వారికి నా పట్ల గల ప్రేమను వ్యక్తీకరించే మార్గమది. కాబట్టి, ఇది నీపై ఆధారపడి ఉంటుంది. **పువ్వులు పెట్టడం ద్వారా బాబాపట్ల నీ ప్రేమను వ్యక్తపరచవచ్చని నీకు అనిపిస్తే, అప్పుడు అలా చెయ్యి, అలా అనిపించకపోతే చేయవద్దు. నీ ప్రేమను వ్యక్తీకరించేది ఏదైనా చెయ్యవచ్చు. ఎవరో ఏవో పనులు చేస్తున్నారు కాబట్టి వాటిని ఎన్నడూ చేయవద్దు. నీకు ఏది అర్థవంతమైనదో ఆ పని చెయ్యి. అదే బాబాకు నచ్చుతుంది.**

**శృతి :** బాబాకు హారతిని ఇవ్వడం గురించి ఏమిటి?

**నాన్నగారు :** నాకు వ్యక్తిగతంగా ఆరతి కూడా ధునినే సూచిస్తుంది. అందుకే నేను ఆరతి చేస్తాను. కానీ మిగతా వారికి ఆరతి అంటే చాలా విభిన్నమైన అర్థం ఉంటుంది. సాధారణంగా, అందరూ దేనినైతే దృష్టి (చెడు దృష్టి) అని పిలుస్తారో దానిని తొలగించడానికి హారతి చేస్తారు.

**శృతి :** దృష్టి అంటే ఏమిటి?

**నాన్నగారు :** ఒక వ్యక్తి అసూయతో లేదా చెడు ఉద్దేశ్యంతో వేరొకరిని చూసినప్పుడు, ఆ చెడు ఆలోచనలు లేదా ఉద్దేశ్యాల కారణంగా ఎదుటి వ్యక్తికి హాని జరుగుతుందని నమ్ముతారు.

**శృతి :** అది నిజంగా సాధ్యమేనా? దృష్టి నిజంగా ఉందా?

**నాన్నగారు :** దృష్టి అంటే చెడు ప్రభావం అనే  సంప్రదాయ అర్థంలో లేదు. కానీ ఒక వ్యక్తి పట్ల తీవ్రమైన భావోద్వేగాలు, ఆలోచనలు సదరు వ్యక్తిని ప్రభావితం చేస్తాయని నేను భావిస్తున్నాను. దానర్థం అది చెడ్డ లేదా మంచి అని కాదు. అది కేవలం బాహ్య ప్రభావం మాత్రమే.



అన్నింటికంటే ముఖ్యమైనది "నేను బాబాకు చెందినవాడిని. బాబా నా వారు!" అనేటువంటి అనుబంధం. అది చాలు! దానిని నువ్వు గుర్తుపెట్టుకున్నంత వరకు అదే నిజమైన స్మరణ అవుతుంది.



**శృతి :** ఇతరుల ఆలోచనలు, భావోద్వేగాలు నన్ను ఏ విధంగా ప్రభావితం చేస్తాయి? ఆలోచనలకు అటువంటి శక్తి ఉంటుందా?

**నాన్నగారు :** అవును. భౌతిక శాస్త్రంలో పదార్థానికి గతిశక్తి, స్థితిశక్తి ఉంటాయని నువ్వు చదువుకుని ఉంటావు. ఇది ఆలోచనలకు కూడా వర్తిస్తుంది. అన్ని యాదృచ్ఛిక ఆలోచనలకు వాటి పరిసరాలలో గణనీయమైన మార్పును కలిగించడానికి తగినంత శక్తి ఉండదు. కానీ ప్రతి ఆలోచనకు ఒక స్థితి శక్తి ఉంటుంది. ప్రతి ఆలోచనకు ఒక మార్పును సృష్టించే సామర్థ్యం ఉంది. స్థితిశక్తితో కూడిన ఒక ఆలోచన తీవ్రమైన భావోద్వేగంతో కలసినపుడు అది గతిశక్తితో కూడిన ఆలోచనగా మారుతుంది. మహాత్ములలో ఈ విషయం కనిపిస్తుంది. కానీ ఇది చాలా అరుదుగా జరుగుతుంది, ఇది దృష్టికి అంత ఖచ్చితంగా వర్తించదు. నేను చెప్పడానికి ప్రయత్నిస్తున్నది ఏమిటంటే, ఎవరైనా ఒకరు చాలా మంది ఉన్న గదిలో ఉన్నప్పుడు, వారు అపరిచితులు కూడా కావచ్చు, అక్కడున్న ప్రతి ఒక్కరి మధ్య నిరంతరం అదృశ్యంగా ఏదో పరస్పరమైన మార్పిడి జరుగుతూనే ఉంటుంది.

**శృతి :** ఏ రకమైన మార్పిడి?

**నాన్నగారు :** ఇస్తున్న వ్యక్తిని, దానిని గ్రహిస్తున్న వ్యక్తిని ప్రభావితం చేసే మార్పిడి. ఇది చాలా సూక్ష్మమైనది, ఎవరూ దానిని గుర్తించలేరు. మన మనస్సులో అనేక ఇతర బలమైన ప్రభావాలు ఉన్నాయి, అంత సూక్ష్మమైన విషయాన్ని మనస్సు రవ్వంత కూడా గుర్తించలేదు.

**శృతి :** ఇది మీకు ఎలా తెలుసు? ఒకవేళ అది కనిపించనట్లయితే, అది నిజంగా ఉందని మీరు ఎలా రుజువు చేయగలరు? అది మీకు అనుభవంలో ఉందా?

**నాన్నగారు :** (అప్పుడు నాన్న గారు నాకు ఒక రష్యన్ ప్రయోగం గురించి చెప్పారు, అది ఈ రకమైన సూక్ష్మ ప్రభావం యొక్క ఉనికిని రుజువు చేస్తుంది. నేను జనవరి 1990లో జరిగిన ఒక తెలుగు సత్సంగం నుండి ఆడియో ఫైలును జత చేస్తున్నాను, అక్కడ నాన్నగారు ఈ ప్రయోగం గురించి వివరంగా మాట్లాడారు.) అవును, అది నా అనుభవంలో ఉంది. నేను చాలా మందిని చూసినప్పుడు, వారందరి ఫోకస్, నా పట్ల వారికి గల తీవ్రమైన భావోద్వేగాలు నాపై ప్రభావం చూపుతాయి. కానీ ఇది చాలా తక్కువ సమయం ఉంటుంది. నువ్వు బయట అందరితో మాట్లాడి ఇంటికి రాగానే ప్రతిసారీ నువ్వు స్నానం చేయాలని నేను ఎందుకు పట్టుబడతానో ఇప్పుడు నీకు అర్థమయ్యి ఉంటుంది.

**శృతి :** నేను నాతో క్రిములు, బ్యాక్టీరియాను ఇంటికి తీసుకురావడం వల్ల మీరు అనారోగ్యానికి



గురవుతారేమోనని నేను అనుకున్నాను! ఇంకా, మీరు చాలా సున్నితంగా ఉంటారు!

**నాన్నగారు :** అవును, అది కూడా. కానీ మరొక కారణం ఏమిటంటే, నేను ఇప్పుడు ప్రస్తావించిన పరస్పరమైన మార్పిడికి సంబంధించినది. ఈ మార్పిడి క్రమంలో మీరు నా వద్దకు తీసుకువచ్చే దానిపట్ల కూడా నేను సున్నితంగా ఉంటాను.

**శృతి :** స్నానం చేయడం ఆ బాహ్య ప్రభావాన్ని ఏ విధంగా తొలగిస్తుంది? నీరు అలా చేయగలదా?

**నాన్నగారు :** లేదు, అది కాదు, కానీ స్నానం దానిని తేలికగా అధిగమించడానికి సహాయపడుతుంది. స్నానం తరువాత నువ్వు నా వద్దకు వచ్చినప్పుడు నీ మనస్సు చాలా తాజాగా మరియు మరింత ప్రశాంతంగా ఉంటుంది.

**శృతి :** సరే, మీరు చాలా సున్నితంగా ఉంటారు కనుక, మీరు దానిని అనుభూతి చెందుతారు, అది కలిగించే అసౌకర్యం గురించి ఎరుకతో ఉంటారు. కానీ నాలాంటి వ్యక్తి సంగతి ఏమిటి? నేను ప్రభావితమయ్యానని నేను ఎలా తెలుసుకోగలను?

**నాన్నగారు :** మళ్ళీ, ఇది చాలా సూక్ష్మమైనది, కాబట్టి చాలా మంది దీనిని గమనించరు. కానీ చాలా మంది వ్యక్తులు ఒకే సమయంలో నీపై దృష్టి పెడతారని, వారి విభిన్న ఆలోచనలు భావోద్వేగాలు అన్నీ నీవైపుగా పెడతారని అనుకుందాం. ఆ సామూహికమైన భావోద్వేగం నీపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ఏ స్పష్టమైన కారణం లేకుండా నీకు విచారంగా లేదా కోపంగా లేదా చిరాకుగా అనిపించినప్పుడు, అది నీకు తెలుస్తుంది. ఇకపై నువ్వు చాలా మంది వ్యక్తులతో బయటకు వెళ్ళినప్పుడు దీనిని గమనించు. అలా కలసిన తర్వాత నువ్వు ఒంటరిగా ఉన్నప్పుడు, ఎలా ఫీలవుతున్నావో, ఏమి ఫీలవుతున్నావో చూడటానికి ప్రయత్నించు. నీకు నువ్వే అన్వేషించి ఇది నిజమో కాదో తెలుసుకోవచ్చు.

**శృతి :** హారతి గురించి నేను ఇంతకు ముందు అడిగిన ప్రశ్నకు తిరిగి వస్తే, బాబా తమ వద్దకు వచ్చే వందలాది మంది వల్ల బాబా ప్రభావితమవుతున్నారని మీరు చెబుతున్నారా?

**నాన్నగారు :** లేదు ఆయన ప్రభావితం కారు.



పాదమంటే ఏంటి? మనముండేటువంటి స్థానం,
మనమెక్కడుంటే అక్కడ మన పాదముంటుంది
కాబట్టి బాబాను మన మనసులో నిలుపుకోవడమే
బాబా పాదాలు పట్టుకోవడమంటే!







**శృతి :** ఎందుకు కారు?

**నాన్నగారు :** ఎందుకంటే ఆయన బాబా. (నాన్నగారు చిన్నగా నవ్వారు!)

**శ్రుతి :** అలాంటప్పుడు సంప్రదాయకంగానూ లేదా మీరు ఇప్పుడే చెప్పిన అర్థంలో దృష్టి వల్ల కూడా బాబా ప్రభావితం కానట్లయితే, అప్పుడు హారతి యొక్క ప్రయోజనం ఏమిటి?

**నాన్నగారు :** మళ్ళీ, ఇది ప్రేమ యొక్క వ్యక్తీకరణ. బాబా అటువంటి ప్రభావాలకు అతీతుడని ప్రజలు అర్థం చేసుకోలేరు కాబట్టి బాబా మీద నుండి కూడా దృష్టిని తొలగించాల్సిన అవసరం ఉందని వారు భావిస్తారు. ఇది బాబాకు నైవేద్యం లేదా నీటిని సమర్పించడం వంటిది. బాబాకు అది అవసరమని కాదు, కానీ మన ప్రేమను మనం వ్యక్తీకరించాల్సిన అవసరం ఉంది కాబట్టి చేస్తాం. మన దైనందిన జీవితంలో మనం మనకు ప్రియమైన వ్యక్తి పట్ల, పసిపిల్ల వాడిపట్ల లేదా తల్లిదండ్రుల పట్ల ప్రేమను ఎలా వ్యక్తం చేస్తామో, అలాగే బాబా పట్ల వ్యక్తం చేయడం కూడా ఉంటుంది. బాబా దృష్టితో బాధపడటం భక్తులకు ఇష్టం లేదు అందుకే వారు హారతి చేస్తారు.

**శృతి :** సరే, వారి ప్రకారం దృష్టి అంత చెడ్డదయితే, దానిని తొలగించడానికి హారతిని ఇస్తే, మనమందరం పూజ్యభావంతో అగ్నిని ఎందుకు తీసుకుని అద్దుకోవాలి? దానిని దూరంగా విసిరేయకూడదా?

**నాన్నగారు :** బాబాకు తీసిన దృష్టి కూడా మనకు ఒక ఆశీర్వాదం అని ఇది సూచిస్తుంది. ఆయనను స్పృశించాక చెడు ప్రభావాలు కూడా మనకు గొప్ప ఆశీర్వచనాలు అవుతాయి.

**శృతి :** సరే, కాబట్టి దృష్టి బాబాకు వర్తించదు. ఆరతి అనే విధి మన ప్రేమ యొక్క వ్యక్తీకరణ. కానీ నాలాంటి సాధారణ వ్యక్తులపై దాని ప్రభావం సంగతి ఏమిటి? అది నిజంగా నాకు హాని చేస్తుందా?

**నాన్నగారు :** అది ఆ ప్రభావంపై ఆధారపడి ఉంటుంది. నీ చుట్టూ అశాంతిగా ఉండే వ్యక్తులు ఉన్నట్లయితే, అప్పుడు ప్రభావం ప్రతికూలంగా ఉంటుంది.

**శృతి :** మార్పిడి రెండువైపులా ఉంటుందని మీరు చెప్పారు. కాబట్టి నేను వారిని ఎందుకు ప్రభావితం చేయలేను? వారు ప్రశాంతంగా లేరని అనుకుందాం, నేను అలా లేను. నేను వారిని సానుకూలంగా ప్రభావితం చేయడానికి బదులుగా నేను ఎందుకు ప్రతికూలంగా ప్రభావితమవుతాను?

**నాన్నగారు :** దీనికి సమాధానం ఏమిటంటే, ఎవరు బలంగా ఉంటే వారు మరొకరిని ప్రభావితం చేస్తారు. అందుకే ఒక మహాత్ముని సన్నిధిలో ఉండటం చాలా విలువైనది. ఆయన ప్రభావం ఎంతో



బలంగా ఉండడం వల్ల మన ప్రభావాలన్నీ నిర్వీర్యం అవుతాయి. మన ఆలోచనలు బలహీనపడతాయి. ఆ మహాత్ముని బలంతో వాటిని అధిగమించడం జరుగుతుంది.

**శృతి :** నేను ప్రతికూల ప్రభావాల బాధితురాలిని అనుకుందాం. అగ్ని (ఆరతి) నిజంగా ఈ ప్రభావాన్ని తొలగించగలదా? అలాంటి ప్రభావాలను నాశనం చేసే శక్తి అగ్నికి నిజంగా ఉందా?

**నాన్నగారు :** లేదు. అది కేవలం ఒక నమ్మకం మాత్రమే.

**శృతి :** అప్పుడు నేను ఆ ప్రతికూల ప్రభావాన్ని ఎలా వదిలించుకోగలను?

**నాన్నగారు :** అలా బాబా ముందు కూర్చో, బాబా గురించి ఆలోచించు, బాబా సన్నిధిలో ఉండటం అటువంటి ప్రభావాల నుండి బయటపడేలా చేస్తుంది. నేను చేసేది అదే. కొంతసేపు బాబాను ధ్యానించడం ఆ అసౌకర్యం నుండి నన్ను నేను విముక్తం చేసుకోవడానికి తోడ్పడుతుంది.

**శృతి :** అంతేనా? (ఈ పరిష్కారం చాలా సింపుల్‌గా ఉందని నేను ఆశ్చర్యపోయాను!)

**నాన్నగారు :** అవును. అంతే! (చిరునవ్వుతో అన్నారు.)

**శృతి :** ఒకవేళ ఆరతి ఇవ్వడం పరిష్కారం కానట్లయితే, మీరు చాలా మంది వ్యక్తులను (దర్శనం) చూసిన తరువాత అమ్మ మీకు ఆరతి ఇవ్వడానికి మీరు ఎందుకు అనుమతిస్తారు? ఒక వ్యక్తి తనకు అర్థవంతంగా ఉండే పనులు మాత్రమే చేయాలని మీరు చెప్పారు కదా?

**నాన్నగారు :** ఇది నాకు అర్థవంతంగా ఉండకపోవచ్చు, అయితే అది అమ్మకు అర్థవంతంగా ఉంటుంది. అది నాకు మంచిదని ఆమె నమ్ముతుంది, నేను దానిని గౌరవిస్తాను. అది అమ్మకు నా పట్ల గల ప్రేమకు వ్యక్తీకరణ. అలా చెయ్యడం సరైనది కాదని, ప్రయోజనం లేదని దానిని తిరస్కరించడం కంటే గౌరవించడం నాకు మరింత అర్థవంతంగా ఉంటుంది.

***– పూజ్య గురుదేవులు మరియు వారి అమ్మాయి***
***సాయినాథుని శృతి మధ్య జరిగిన సంభాషణ***
***www.lifeofasaiseeker.com నుండి అనువదించబడినది.***



ఊదీ అంటే మొత్తం దహించబడి, ఇక దహింపబడటానికి ఏమీ మిగలని ఆ ప్రేమాగ్ని యొక్క చివరి స్థితి. అది ఊదీ అంటే. దీనిని గుర్తుపెట్టుకోవడం కోసం దానికి మన దేహంలో ముఖ్యభాగమైన నుదిటి మీద పెట్టుకుంటాం.



# జగద్గురువు - మనోధ్యానం

నారదమునులకు మాత్రమే శ్రీకృష్ణుని యొక్క అంతఃపురములోనికి ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్ళగలిగే వరం కలదు. ఎవరూ వారిని ఎప్పుడూ, ఎక్కడా వారించరు. ఒకసారి వారు ద్వారక చేరుకున్నారు. వారికి శ్రీకృష్ణులవారు ఎక్కడా కనిపించక, వారు రుక్మిణి వద్దకు చేరుకొని, శ్రీకృష్ణులవారు ఎక్కడ ఉన్నారు? కనిపించుటలేదే అని అడిగినారు. అపుడు రుక్మిణీదేవి పూజాగృహం వైపు వెడలి చూడగా అచట స్వామి ధ్యానంలో ఉన్నారు. కొంత సమయం తర్వాత స్వామి కనులు తెరిచి నవ్వుతూ నారదుల వారిని స్వాగతించినారు. అంతట నారదుల వారు "భగవాన్ అందరూ తమను ధ్యానించుదురు కదా. మీరు ఎవరిని ధ్యానించుచున్నారు" అని అడిగెను. అంతట శ్రీకృష్ణులవారు గంభీరముగా "దేవర్షి! నేను ఎల్లపుడూ నా భక్తులను ధ్యానించుచుందును" అని పలికిరి. ఇది గురువుల స్థితి. అంతట నారదులవారు ఒక క్రొత్త అనుభూతిని, తత్త్వమును పొంది స్వర్గలోకమునకు పయనమైనారు. **మీరు ఎక్కడున్నా, ఏమి చేస్తున్నా, నాకు తెలుసు అన్న ఎరుకలో ఉండండి అంటారు శ్రీసాయి.** వారి ఆలోచనలు వారి చూపులు ఎప్పుడూ మనమీదనే ఉన్నాయి అని మాటగా చెప్పి, ఎన్నో లీలలలో నిరూపణగా చూపారు శ్రీసాయి. ఈ కోణంలో గురుదేవుల అనుగ్రహభాషణాన్ని చూద్దామా?

**భక్తుడు :** భక్తజన హృదయాబ్జభృంగమై అంటే ఏమిటి సార్?

**గురువుగారు :** భక్తుల హృదయమనే పద్మం చుట్టూ తిరిగేటువంటి తుమ్మెద వంటి వాడు బాబా అని అర్థం. మామూలుగా భగవంతుని చంద్రునితో పోలుస్తూ, భక్తులు చకోరాల్లాగా చూస్తున్నారని చెప్పారు. కానీ ఇక్కడ బాబానే చెప్పారు **"నేను నా భక్తుల కోసం వచ్చాను. నా భాండాగారాన్ని తెరచి, నేను మీ కోసం కాచుకోనున్నాను" అని. మనం ఆయన కోసం పడేటువంటి ఆర్తి కంటే కూడా ఆయన మన పట్ల పడేటువంటి ఆర్తి ఎక్కువ. ముందు మనల్ని ఆయనే చూస్తారు. ఆ తరువాత మనం ఆయనను చూస్తాము.** ఆయన అనుగ్రహదృష్టే మన మీద పడుతుంది. మన గురించి మనకంటే ఎక్కువ ఆయనే తాపత్రయపడుతున్నాడు. కాబట్టి మన హృదయమనే పద్మం చుట్టూ తిరిగేటువంటి తుమ్మెదలాంటి వాడు ఆయన అని చెప్పానన్న మాట. ఆయన తుమ్మెద. మనం కాదు తుమ్మెదలం (నవ్వులు). బాబా యొక్క ప్రేమతత్త్వం అటువంటిది. ఆయన అవతారకార్యం కూడా అదే. ఆయన ఎందుకోసం వచ్చారు అని అన్నపుడు **'స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం'** అని ఉపాసనీ బాబా



ఎంత చక్కగా, ఎంత గొప్పగా వ్రాసాడో! భక్తుల యొక్క అవసరం, వాళ్ళ యొక్క కోరిక, వాళ్ళ తపన, వాళ్ళ ఆర్తికి సమాధానంగా సాయి అనేటువంటి ఆ రూపం అట్లా ఉద్భవించింది. దానికై దానికేం లేదు. మన యొక్క ఆర్తికి చిహ్నమే ఆయన. అది చెప్పడానికి కూడా అర్థమది. ఆయన యొక్క అస్తిత్వం ఏమిటయ్యా అనంటే భక్తుల యొక్క హృదయం చుట్టూ తిరిగేటువంటి భృంగంలాంటి వాడాయన. ఆయనకు ఇష్టమైనదేంటి? **"భక్తి"** అనేటువంటి **"మధువు"**. దానినే ఆయన ఆస్వాదిస్తారు, ఆనందిస్తారు. దీనికోసం మన హృదయం చుట్టూ తిరుగుతూ ఉన్నారు, మన హృదయాలేవీ విచ్చుకోవడం లేదు. మూసుకుపెట్టుకోనున్నాం. ఆయనేమో తుమ్మెదలా "ఊ!ఊ!ఊ!" అని తిరుగుతున్నాడు చుట్టూ (నవ్వులు). అది దానర్థం".

"ప్రదక్షిణ అంటే మనం ఎవరినైతే ప్రేమిస్తున్నామో వారి చుట్టూ మన ఆలోచనలు తిరుగుతూ ఉండటం" అంటారు శ్రీబాబూజీ. అలా బాబా ఆలోచనలు మన చుట్టూ తిరుగుతున్నాయి అనుకుంటే బాబా మన చుట్టూ తిరుగుతున్నట్లే కదా! గురుపథంలో ఇలాంటిదే మరో లీల.

ఒక శరీరం హిమాలయాల్లో తపస్సు చేస్తూ ఉంటుంది. శ్రీరామాధీర్ విశ్వకర్మగారు హిమాలయ యోగులలో ఒకరు. వారి గురుదేవులకు ప్రథమ శిష్యులలో ఒకరు. 1950వ దశకానికి సంబంధించినవారు. 1953లో వారి గురుదేవులతో కలిసి పనిచేసారు. ఆయనతో మంచి సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయన ఇలా చెప్తున్నారు. "ఒకసారి పూజ్యగురుదేవుల దగ్గరకు మధుర వెళ్ళాను. గురుదేవులు తన గదిలో కూర్చుని ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఇంతలో ఆయనకు తను ఎవరినో కలవడానికి వెళ్ళాలి అని – నిశ్చయమైన విషయం గుర్తు వచ్చింది. ఆయన అప్పటికి సగం ఉత్తరం మాత్రమే వ్రాసారు. మిగిలిన సగం అలాగే వదిలి వేసారు. ఆయన తన గదికి తాళం వేసి నన్ను తోడు తీసుకొని, నిర్ణయించిన కార్యక్రమం గురించి వారిని కలవడానికి బయలుదేరి వెళ్ళారు. ఆ కార్యక్రమం అయిన తరువాత మేము ఇంటికి తిరిగి వచ్చాక గురువుగారే స్వయంగా తాళం తీసారు. అపుడు నేను చూసిందేమిటంటే–ఏ లేఖను పూర్తిగా వ్రాయకుండా సగం వ్రాసి



మన నిజ స్వరూపాన్ని మరింత స్పష్టంగా చూపించి, మనం తపిస్తున్న దానికోసం కృషి చేయాలని తెలియచేసే అద్దంలాంటి వారు సద్గురువు.





బయటకు వెళ్ళారో ఆ లేఖ పూర్తిగా వ్రాసి ఉండటం. నేను వెంటనే ఆశ్చర్యంతో గురువుగారిని అడిగాను. గురువుగారూ! మీరు సగం ఉత్తరం మాత్రమే వ్రాసారు కదా! కానీ ఉత్తరం పూర్తిగా వ్రాసి ఉందేమిటి? ఎలా?" అని. గురువుగారు నవ్వుతూ "నాయనా ఒక్క శరీరంలో ఇంతపని ఎలా కుదురుతుంది? నాకు పంచశరీరాలు ఉన్నాయి. ఒక శరీరం హిమాలయాల్లో తపస్సు చేస్తూ ఉంటుంది. మిగిలిన శరీరాలతో యుగనిర్మాణానికి సంబంధించిన పెద్ద పెద్ద కార్యాలను చేస్తుంది. నేను చేసే పనులలో మీకు కనిపించేవి 3% మాత్రమే. 3%లో కొంత భాగం మాత్రం సాధకుని స్థాయిలో ఉన్న వ్యక్తి తెలుసుకోగలుగుతాడు. మిగిలిన 97% పనులు నేను అదృశ్యంగా చేసాను. ఈ ప్రపంచానికి తెలియకుండా చేసాను. **– 'గురుకృప' సంకలనం**

## నివేదిత, గురుశిష్య సంబంధానికి ప్రతీక

నివేదిత–శిష్యురాలి జీవనవ్రతాన్ని ప్రతిబింబించేలా గురువు వివేకానంద ప్రదానం చేసిన సంస్కృతనామం అది. మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్ తన జీవితంలో గురువు ఇచ్చిన నామానికి సార్ధకతను చేకూర్చడమే కాదు, భారతావని విషయంలో ఆయన యొక్క ప్రతీ ఆశకు, ఆశయానికి కార్యరూపం తీసుకురావడంలో కృతకృత్యురాలయ్యింది. తన గురువు వంటి దృఢచిత్తాన్ని, వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొని, గురువుకు తగ్గ శిష్యురాలినని నిరూపించుకుంది.

**సత్యం :** ప్రపంచంలో అన్నిటినీ తనలో ఇముడ్చుకోగలిగిన, అన్నిటికీ అర్థం చెప్పగలిగినది. అట్టి సత్యం కోసం ఆమె అన్వేషించింది. ఛాందసభావాలు, నిరంకుశధోరణులు, సంకుచితాలు, అంధవిశ్వాసాలకు చోటులేని ఆదర్శం కోసం ఆమె కలలు కన్నది. "నా చిన్నతనంలో నాకు ఒకే ఒక ఆకర్షణ ఉండేది. అది సత్యంపై ఆకర్షణ" అని ఆమె అనేవారు. అటువంటి సత్యం కోసం ఆమె అన్వేషించింది. దాని కోసం నిరీక్షించింది. తన ఆ నిరీక్షణ ఫలిస్తుందని ఆమె ప్రగాఢంగా విశ్వసించింది. ఆ సత్యం ఆమె వేదాంతంలో కనుగొన్నది. ఆ వేదాంత ఆశయాలకు సాకారరూపమైన స్వామి వివేకానందను తన జీవన మార్గదర్శిగా ఎన్నుకొన్నది. ఆయన యొక్క ప్రగాఢ దేశ ప్రేమకు తనను ఒక సేవకురాలిగా భావించుకొని భారతదేశానికి వచ్చిన మార్గరెట్, భారతదేశంలో ఏ భారతీయుడూ పొందనంత తాదాత్మ్యతను భారతదేశంతో పొందింది. అందుకే బిపిన్ చంద్రపాల్ అన్నారు "నివేదిత భారతదేశాన్ని ప్రేమించినట్లు మరే భారతీయుడైనా ప్రేమించాడా అన్నది సందేహాస్పదమే". నివేదిత మన దేశానికి **ఏమి** చేసింది అనే ప్రశ్నకు "ఆమె **ఏమి** చేయలేదు" అన్న మరొక ప్రశ్న సమాధానం



కాగలదు. (ఆమె ఏమీ చేయలేదు, ఒక్క అక్షరంలో చిన్న మార్పు, అర్థంలో ఎంత మార్పు తెస్తున్నదో గమనిస్తే మనం మాట్లాడుతున్నపుడు, రాస్తున్నపుడు ఎంత శ్రద్ధ, జాగరూకత అవసరమో తెలుస్తున్నది కదా! ఈ ఎరుకలో ఉండాలి. అదే సాధన).

భారతదేశం విషయంలో ఆమె ఎలా ఉండాలో నిర్దేశిస్తూ స్వామీజీ ఒకసారి ఆమెకు రాసారు **"ఒకేసారి నీవు భారతదేశానికి శాసకురాలు, సేవకురాలు మరియు స్నేహితురాలిగా ఉండాలి"** అని. ఆమె అక్షరాలా తన గురువు ఆదేశించిన పాత్రను నిర్వహించింది. భారతీయులు ఆత్మగౌరవాన్ని మరచినపుడు, విదేశీయులను అనుకరిస్తున్నపుడు వారిని కఠినమైన పదజాలంతో ఒక శాసకురాలిగా శాసించింది. భారతీయులు అనారోగ్యంతో ఉన్నపుడు సేవకురాలిగా సేవించింది. ప్లేగు మహమ్మారి కలకత్తాను అతలాకుతలం చేస్తున్నపుడు వీధులను శుభ్రపరచి, తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అనన్యసామాన్య సేవలను అందించింది. జగదీష్ చంద్రబోస్ వంటి ప్రతిభావంతుడైన భారతీయ శాస్త్రజ్ఞుడు జాతివివక్షతకు గురైనపుడు ఒక స్నేహితురాలిగా తన మద్దతును, సహకారాన్ని అందించింది. ఇవన్నీ ఆమె నిశ్శబ్దంగా ఫలితాన్ని ఆశించకుండా చేసింది. అంతేకాదు, తన కార్యసాధనలో ఎన్ని కష్టాలు పడినా, ఒక్క నిందా వాక్యం కూడా ఆమె నోటి నుండి వెలువడలేదు. ఇది నివేదిత వేసిన ఒక్క అడుగు. ఆమె అసామాన్య వ్యక్తిత్వాన్ని చూసి అబ్బురపడిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆమెను లోకమాత అని అభివర్ణించారు.

నివేదిత ఇక్కడ తన మతాన్ని ప్రచారం చేయడానికి ప్రయత్నించలేదు. తను ఇక్కడ ఇవ్వడానికి వచ్చింది. ఇక్కడ నుండి ఏదీ ఆశించలేదు. ఏ పని చేసినా ఆమె చాలా నిశ్శబ్దంగా ఇహలోకంలో, పరలోకంలో కీర్తి ప్రతిష్ఠలను ఆశించకుండా చేసింది. ఆమె తాను సేవ చేయడానికి ఎంచుకున్న దేశానికి జాలితో, ఏదో అంతర్గత ప్రణాళికలతో సేవ చేయలేదు. ఆమె నిస్వార్థంగా, ఆరాధనభావంతో సేవ చేసింది. తనను మానసికంగా క్రిందిస్థాయిలో ఉంచుకొని ఈ దేశాన్ని, సంస్కృతిని ఉచ్ఛస్థానంలో ఉంచి, సేవ చేసింది. భారతీయ సంస్కృతిని పూర్తిగా అధ్యయనం చేసిన తరువాతనే ఆమె భారతదేశాన్ని గురించి వ్రాసింది, మాట్లాడింది. భారతీయ సమాజంలోని కేవలం కొన్ని దోషాలను గోరంతలు

మీ బలమైన అహాన్ని పోగొట్టుకోవడానికి, ప్రేమను పెంచుకోవడానికి,
మిమ్మల్ని మీరు కోల్పోయి అందరితో మమేకమయ్యే
సామర్థ్యాన్ని పెంచుకోండి.





కొండంతలు చేసి వక్రీకరించిన మిషనరీలవలే కాక, తన సూక్ష్మ పరిశీలనాదృష్టితో భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని గుర్తించి స్వదేశీయులు, విదేశీయులు అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పగలిగింది. ఈ ఒక్క లక్షణం మార్గరెట్‌ను ఇతర విదేశీయుల నుండి ఎంతో ప్రత్యేకంగా ఉంచుతుంది. (గురువు ఉన్న వారికి, లేని వారికి బేధం ఉండాలి)

మొట్టమొదటిసారిగా స్వామి వివేకానంద, నివేదితను మాతృదేవి వద్దకు పంపించినపుడు ఎంతో భయపడ్డారు. మాతృదేవి గ్రామీణ స్త్రీ. ఆనాటి కట్టుబాట్ల వలన నివేదితను మేచ్ఛ స్త్రీ అంటూ దూరంగా ఉంచేస్తారేమో అని అనుకున్నారు. మాతృదేవికి ఆంగ్లభాష రాదు. నివేదితకు వంగభాష రాదు. అందువలన భాషానువాదం కోసం స్వామి స్వరూపానందను వెంటపంపారు. ఆయన నివేదితను పరిచయం చేసిన వెంటనే మాతృదేవి ఎంతో ఆనందించారు". "నీ పేరేమిటి"? అని అడిగారు. 'మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్' అని చెప్పింది నివేదిత. అప్పుడు మాతృదేవి "ఇంత పెద్ద పేరును నేను జ్ఞాపకముంచుకోలేను. అందువలన **'ఖుకీ' (అమ్మాయి)** అని పిలుస్తాను" అన్నారు. **"సరే, నేను మాతృదేవి అమ్మాయినే కదా"** అంది నివేదిత. మాతృదేవి నివేదిత తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు. మాతృదేవితో స్వయంగా మాట్లాడటం కోసమే నివేదిత వంగభాషను నేర్చుకుంది. **– గురుకృప**

**మహాత్ములకు మనమివ్వవలసిన నివాళి (ఆరతి)**

**నిరాడంబరత వారి ఆభరణం... ప్రేమ, ఆత్మీయత వారి సహజ గుణం.**

తమిళనాడులోని కోయంబత్తూర్, పురవిపాళ్యం తదితర ప్రాంతాల్లో – భక్తకోటికి కోటి కోటి దీవెనలిచ్చే 'కోటిస్వామి'గా సుప్రసిద్ధులైన మహాత్ముని గురించి 'సాయిపథం' పత్రికలో ప్రచురించాలని భావించి వారిని కలుసుకునేందుకు, 1989 ఫిబ్రవరి 12న శ్రీబాబూజీ అక్కడకు వెళ్ళారు. శ్రీబాబూజీని చూడగానే **'గాంధీతాత, గాంధీ తాత'** అని శ్రీకోటిస్వామివారు సంతోషంతో పెద్దగా కేకలు పెట్టారు. స్వాతంత్ర్య సమరసారథి, జాతిపిత శ్రీబాపూజీ. సంస్కరణోద్యమానికి సాయిపథసారథి – పూజ్యశ్రీబాబూజీ. భారతావని దాస్యశృంఖలాలు తెంచి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన మహాత్ములు మహాత్మాగాంధీగారైతే, మూఢత్వ భావాలతో బందీలైన సాయిభక్తులను భావదాస్యం నుండి విముక్తుల్ని చేసి మానసిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి, సాయినిజతత్త్వాన్ని దర్శింపచేసిన మహామహితాత్ములు శ్రీబాబూజీ.



శ్రీసాయి దివ్య సామ్రాజ్యాన్ని పరిరక్షించే ఆ మహాయోధుని అక్షర తుణీరం నుండి సంధించిన శ్రీసాయి ప్రబోధ వ్యాసాస్త్రాలు (సాయిభక్తి సాధనా రహస్యం) మనిషిలోని మహిషతత్త్వాన్ని తరిమికొట్టాయి. అదో 'ఆధ్యాత్మిక విప్లవం'. సాయితత్త్వంలో చొచ్చుకుపోయిన మూఢత్వంపై ప్రేమతో 'సమరం'. ఒకవైపు ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలను వివరిస్తూ, మరోవైపు సాయి సంప్రదాయంలో చొప్పించబడ్డ మూఢాచారాలను తూర్పారబడుతూ, శ్రీబాబూజీ రచించిన వ్యాసాలు భక్తులను సరైన మార్గంలో పయనింపచేస్తున్నాయి.

అది 1915వ సంవత్సరం, మార్చి నెల, పదవతేదీ – మహాత్మాగాంధీ కోల్‌కతా శివారులో విశ్వకవి ప్రారంభించిన శాంతినికేతన్‌లో అడుగు పెట్టినరోజు... ఆ శుభదినాన రవీంద్రుడు శాంతినికేతన్ వద్ద మహాత్ముడికి ఘనస్వాగతం పలికి తన విద్యాలయంలోనికి తీసుకువెళ్ళారు. దక్షిణాఫ్రికాలో ఏర్పరచుకున్న తన జీవిత నియమావళికి అనుగుణంగా ఆ సత్యాగ్రాహి శాంతినికేతన్లో కూడా ఏ సేవకుల సహాయమూ కోరలేదు. తన గది తానే శుభ్రం చేసుకున్నారు. తన పక్క తానే సర్దుకున్నారు. తన పాత్రలు తానే కడుక్కున్నారు. తన వస్త్రాలు తానే ఉతుక్కున్నారు. (గురుబంధువులెవ్వరికీ సొంత పనులు చెప్పవద్దు – శ్రీబాబూజీ). శాంతినికేతన్‌లో చదువుకుంటున్న విద్యార్థుల మీద ఇది చెరగని ముద్రవేసింది. వాళ్ళలో చాలామంది గాంధీజీని అనుసరించాలని ఆరాటపడ్డారు. సత్యహరిశ్చంద్ర నాటకం గాంధీజీపై ప్రభావం చూపితే (సత్యాన్ని అంటిపెట్టుకునే విషయంలో) గాంధీజీ నియమావళి, ఆచరణ ఆ విద్యార్థుల హృదయాలపై ముద్ర వేసింది. బాబాలీల ఒకటి జరిగింది అంటే ఆ "లీలలో ఒక రాజముద్రిక వదిలి ఉంటారు" అంటారు శ్రీబాబూజీ. ఆ ముద్ర మన మనసులని శుద్ధి చేసి సంసిద్ధుల్ని చేస్తుంది. అట్టి సంసిద్ధతనే మన నుంచి బాబా ఆశిస్తున్నది. ఈ మార్పే మనం బాబా ముద్రను గుర్తించడానికి దోహదం చేస్తుంది. కానీ మనం ఆ ముద్ర కోసం బయట వెతుకుతున్నాం. వెతకవలసినచోట వెతకడం లేదు.

మనం విత్తులా ఉన్నామా? రాయిలా ఉన్నామా? సూర్యకిరణం సోకిన విత్తు మొలకెత్తుతుంది.

మన యొక్క అవగాహనారాహిత్యం, మన తెలివితేటలు,
మన ఊహాకల్పనలు... ఇవి నిజమైన అడ్డంకులు. మన మార్గంలో
మనకు మనమే అడ్డమవుతాం. అంతేగాని బయట ప్రపంచం కాదు.





సూర్యకిరణం సోకిన రాయి ఏమీ అవ్వదు కదా. సూర్యునికి ఆరాధన చేయడం అన్నా, కృతజ్ఞత చెప్పడం అన్నా, ఆయన వచ్చే సమయానికి మనం సిద్ధంగా ఉండటం. సూర్యకిరణం సోకిన పద్మం వికసిస్తుంది. ఎలా అంటే సూర్యకిరణం సోకగానే వికసించేలా తనని తాను సిద్ధం చేసుకుంటుంది. "ప్రాతఃదర్శనమివ్వుము సాయి" అని అడిగే మనం ఆ దర్శనానికి మనల్ని మనం సిద్ధం చేసుకున్నామా? దానికోసం ముందుగా ఆ సన్నిధికి వచ్చి, ఆయన ఊసు, ధ్యాసలలో ఉండే ప్రయత్నంలో భాగంగా నామస్మరణ, కీర్తన, ధ్యానాదులు జరుగుతున్నాయా?

మార్చి 10వ తేదీన శాంతినికేతన్‌లో ఓ ప్రయోగం జరిగింది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం ఆ రోజు వంటవాళ్ళు, పనివాళ్ళు, మరుగుదొడ్లు శుభ్రం చేసేవారి సేవల్ని ప్రక్కన పెట్టేసారు. ఇదంతా గాంధీజీ పర్యవేక్షణలో జరిగింది. ఇలాంటి నియమం నిరంతరాయంగా కొనసాగాలనే ఉద్దేశ్యంతో రవీంద్రుడు గాంధీజీ శాంతినికేతన్‌లో అడుగుపెట్టిన మార్చి 10వ తేదీన గాంధీ దినోత్సవంగా ప్రకటించారు. ఇప్పటికీ శాంతినికేతన్‌లో ఈ పర్వదినాన్ని విధిగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. (ఇలా మన గురువు మన జీవితాల్లోకి ప్రవేశించిన రోజును పర్వదినంగా చేసుకోగలుగుతున్నామా?) ఆ రోజు మొత్తం పనంతా విద్యార్థులే స్వయంగా చేసుకుంటారు. కార్మిక సిబ్బందికి మార్చి 10న ఆటవిడుపు. గాంధీగారి గురించి సీతారామశాస్త్రి గారన్న మాటలే అయినా అవి గురుదేవుల పథాన్ని ప్రతిబింబిస్తాయి.

ఆశ్రమదీక్ష, స్వతంత్ర్య కాంక్ష, ఆకృతి దాల్చిన గురుదేవా!
కర్మయోగమే జన్మంతా, ధర్మక్షేత్రమే బ్రతుకంతా!
పదవులు కోరని పావనమూర్తి, హృదయాలేలిన చక్రవర్తి!
గుర్తింపు కోరని పావనమూర్తి, హృదయాలేలిన సమవర్తి మా గురుదేవులు శ్రీబాబూజీ!

**నినాదాలు శంఖారావాలై...** గాంధీజీలా త్యాగం చేసిన దేశభక్తులు ఈ దేశంలో చాలా మందే ఉన్నారు. ఆయనకన్నా తీవ్రాతితీవ్రమైన కష్టాల్ని, శిక్షల్ని అనుభవించినవాళ్ళు ఎందరో ఉన్నారు. అలాగే ఆధ్యాత్మిక వేత్తలు, తపోదీక్షులు కూడా! ఆయన పేరు మీద నడుస్తున్న సంస్కరణలు అన్నీ ఆయన పూర్వికులో, సమకాలికులో రూపొందించినవే! ప్రవచించినవే. గ్రామీణ పునర్నిర్మాణం, విద్యావ్యవస్థలో చేతివృత్తులకు ప్రాధాన్యం, నిరాడంబర జీవనం తదితర ఆదర్శాలు కూడా! కానీ ఈ కార్యక్రమాలన్నీ గాంధీజీ చేపట్టినపుడు మాత్రమే జనావళిని తీవ్రంగా ఉత్తేజపరచగలిగాయి. దీనికి



ప్రధాన కారణాన్ని విశ్లేషిస్తూ రవీంద్రనాథ్ ఠాగూర్ **"తాను ప్రవచిస్తున్న ఆదర్శాలతో పూర్తిగా తాదాత్మ్యం చెంది, తన దర్శనాన్ని, అస్తిత్వాన్ని ఒక్కటిగా చేసుకున్న ఆ పూర్ణమానవుడి గొప్ప జీవశక్తి వల్ల ఆ కార్యక్రమాలు వేగవంతం కాగలిగాయి" అంటారు.** నిజమే, మహాత్ముడి నినాదాలన్నీ తొలుత ఆయన జీవితంలో ధ్వనించాయి. ఆ తరువాతే ప్రపంచమంతా ప్రతిధ్వనించాయి. అందుకే ఆ నినాదాలు లోకమంతా శంఖారావాలై వ్యాపించాయి. మహాత్ముడు తాను చెప్పేది ఏదయినా, తాను ఆచరించే మనకు చెబుతారు. నేను చేయగలిగాను అంటే అందరూ చేయగలరు అంటూ. దాని ఆచరణలోని సులువులు చెబుతారు మనకు. అది వారి అనుభవజ్ఞత. (రామకృష్ణులు పిల్లవాడు.. జ్వరం.. తీపి తినవద్దు అన్న వృత్తాంతం).

**మాటలు కాదు... చేతలు :** సమాజం కోసం గాంధీజీ ఒక ప్రయోగాన్ని ప్రతిపాదిస్తున్నారంటే, ఆ కఠిన దీక్షని ముందు తనకు తాను విధించుకుంటారు. త్యాగం చేయమని ఎదుటివాళ్ళకి పిలుపునిచ్చే ముందు తనే స్వయంగా ఆచరించి చూపిస్తారు. ఆ మహామనిషి, ముందు తన సుఖాల్ని, సౌకర్యాల్ని వదులుకొని అపుడు తక్కినవాళ్ళని త్యాగం చేయమనటానికి సాహసిస్తారు. ఉదాహరణకు సహాయ నిరాకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. అందులో భాగంగా ఒకరోజు సబర్మతీ ఆశ్రమంలో విదేశీ వస్త్రాలన్నింటినీ పోగుచేసి, మహాత్మాగాంధీ సమక్షంలో దహనం చేస్తున్నారు. ఇంతలో గాంధీజీ కుటుంబ సభ్యులొకరు విలువైన, కళాత్మకమైన ఒక మహారాష్ట్ర చీరను ఇక్కడకు తీసుకువచ్చారు. అది గాంధీజీ రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే, మహాత్ముడి అర్ధాంగి కస్తూరిబాయికి కానుకగా ఇచ్చిన చీర. దానిని అల్లుకొని ఎన్నో పవిత్ర స్మృతులున్నాయి. విదేశీనూలుతో తయారైన చేనేత చీరను భద్రపరచాలా లేక దానిని కూడా అగ్నికి ఆహుతి చేయాలా అని ఎవరో గాంధీజీని ప్రశ్నించారు. ఆ ప్రశ్న విని మహాత్ముడు చలించిపోవడం అక్కడ అందరికీ కనిపించింది. ఆయన ఒక్కక్షణంపాటు ఆలోచించి, మరుక్షణం ఆ కళాత్మక బహుమానాన్ని స్వయంగా తన చేతులతో తానే అగ్నికి ఆహుతి ఇచ్చేసారు. అదీ వారి ప్రత్యేకత.



దేశకాల పరిమితులకు అతీతమైన అనుభవమనే నీలాకాశపు నేపథ్యంలో,
మమతానుబంధాల వర్షపుజల్లుల వెనుక, జ్ఞాన వైరాగ్యాల వెలుగులో
మనోహరంగా ప్రకాశించే ఇంద్రధనస్సు - శ్రీసాయిరూపం



**కర్మలో అకర్మ : మహాత్ముడిని అర్థం చేసుకోవాలన్నా, అనుసరించాలన్నా ముందు ఆయనలోని ఆధ్యాత్మిక కోణాన్ని దర్శించగలగాలి.** విత్తుని చూసాం.. ఎలా చూస్తున్నాం! విత్తులో ఉన్నదాన్ని చూడగలుగుతున్నామా? ఎలా చూడాలో చూపేవారు గురువు. విత్తు...పిలక... మొక్క... చెట్టు...మాను...కొమ్మ...రెమ్మ...చిగురు... ఆకులు...మొగ్గ...పువ్వు... పిందె.... కాయ...పండు... విత్తులో ఇంత ఉంది. ఆ విత్తు పలువిత్తులుగా ఆ పండులో ఉన్నాయి. ఓ చెట్టుని చూసి ఇంత క్రమాన్ని, పరిణామాన్ని, ప్రేమని దర్శించగలుగుతున్నామా! **(Tree of Love).**

అది మొక్కగా ఉన్నపుడు దాన్ని తినాలనుకున్నాను. ఇపుడు అదే నాకు నీడనిస్తున్నది. ఆకలి తీరుస్తున్నది అని సేద తీరుతున్న జంతువు ఆలోచించగలదా? అట్టి ఆలోచన మనుషులమైన మనకు రావాలి కదా! అలా రాకపోతే, అలా చూడలేకపోతే మనము, అవి ఒకటే కదా! ఆ ఆలోచన కలిగితే కృతజ్ఞత చెప్పినట్టే. మన ప్రవర్తనతో వర్తనంలో కృతజ్ఞత వ్యక్తీకరణే మన ఎదుగుదలకు, అభ్యున్నతికి గుర్తు. అట్టి దర్శనం అనుభూతినిస్తుంది. విత్తులో ఇంత పరిణామం దర్శిస్తున్నామా?

జాతిపితలోని ఆ పారమార్థిక కోణాన్ని అర్థం చేసుకున్న భగవాన్ రమణులు వారిని కర్మయోగిగా అభివర్ణించేవారు. రమణులు తరచూ గాంధీ మహాత్ముడి గురించి భక్తుల ముందు ప్రస్తావించేవారు. గాంధీజీ కూడా మహర్షిని కలుసుకునేందుకు మూడుసార్లు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ పని ఒత్తిడి, జనసందోహం వల్ల కుదరలేదు. ఒకసారి కె.అరుణాచలం అనే గాంధేయవాది రమణులను సందర్శించినపుడు "భగవాన్! మీరు అందరినీ **'ఊరక'** ఉండమంటారు. **మీరు ఉండి చూపిస్తారు.** కానీ మహాత్మాగాంధీ అందరినీ కార్యనిమగ్నులు కమ్మంటారు. ఆయన కూడా ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. ఎందుకు ఈ తేడా" అని ప్రశ్నించారు. అపుడు మహర్షి మందహాసంతో నేను "ఊరక కూర్చుంటున్నానని నీకెవరు చెప్పారు? అక్కడ గాంధీజీ పనిలోనే నిమగ్నమయ్యారని ఎందుకనుకుంటున్నావు? ఇక్కడ **అకర్మలో కర్మ** ఉంది. అక్కడ **కర్మలో అకర్మ ఉంది**" అంటూ "కర్మలో అకర్మను, అకర్మలో కర్మను ఎవరు దర్శిస్తారో వారు యోగులు" అన్న కృష్ణభగవానుడి గీతావాక్యాన్ని గుర్తుచేసారు. (చేతనం... అచేతనం) గాంధీజీ అంత ఉద్రిక్తతలతో కూడిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని కూడా నిశ్చల మనోస్థితితో యోగిలా ముందుకు నడుపుతున్నారని చెప్పకనే చెప్పారు. **మహాత్మాగాంధీ నుంచి మనం అలవరచుకోవలసిన మణిపూసలాంటి గుణమిది.**

మహాత్ముల జయంతి, ఆరాధన ఉత్సవాలలో వారి నియమావళిని పాటించాలి. ఆ ఆచరణానుభూతి



మన జీవనంలో నియమావళిని పాటించేలా చేస్తుంది. (నియమము అంటే నిలబెట్టేది) అది అనుభవాన్ని అంటిపెట్టుకోవడం అంటే. అదే మన నిత్య ఆరాధన. నిత్య ఆచరణే... నిత్య ఆరాధన అంటారు ఓ మహాత్ముడు. నియమావళిని పాటించే వారి జీవనాలలో నిత్య దీపావళి. "నా వారు అనుకున్న వారు నా పద్ధతులు నచ్చిన వారు నా మార్గాన్నే అనుసరిస్తారు, నా పద్ధతులనే పాటిస్తారు" అన్నారు శ్రీబాబూజీ.

మహాత్ముల జీవితమే మనకు మార్గదర్శనం. ఆ మార్గంలో పయనించడానికి ప్రయత్నించి ఏ కొద్దిగా సఫలమైనా అది ఆ మహనీయునికి మనమిచ్చే మహోన్నతమైన నివాళి అవుతుంది. **గురుని దర్శనం మనతో వారికున్న అనుబంధానికి నిదర్శనం.** వారి చూపులో కృప, కరుణ, ఆత్మీయత భరోసా ఉన్నాయి. వారి చిరునవ్వులో వాత్సల్యం, అభయం వ్యక్తం అవుతున్నాయి. వారి ఔన్నత్యం తెలిసే కొద్దీ వారిపట్ల గౌరవాభిమానాలు పెరుగుతుంటాయి. వారి మహనీయతను గుర్తించేకొద్దీ వారి పట్ల ఉన్న గౌరవాభిమానాలు ఆరాధనగా మారతాయి. అనుభవించే కొద్దీ ఆచరణగా రూపుదిద్దుకుంటాయి. ఇది నిజమైన ఆరాధనా ఫలం. ఇది ఆరాధనోత్సవం.... నిత్యోత్సవం.

గురువు ఆలోచనలను, ఆదర్శాలను ఆచరణలో పెట్టడమే వారికి మనమిచ్చే నివాళి.

*సంకలనం : గురుకృప*

## అవ్యాజ ప్రేమికుడు శ్రీసాయి - శ్రీబాబూజీ

**గురుబంధువు :** మనలో ఏమి చూసి బాబా మనలను ప్రేమిస్తున్నారు?

**గురువుగారు :** మనం ఉండేటువంటి స్థితి ఇది. ఈ స్థితిలో నుండే మనలను తీసికొనిపోతూ మార్పు చేసుకుంటూ పోతుంటారాయన. ఎట్లా? ఒక ఉదాహరణ. ఎవరో ఏదో ఒక కోరిక కోరతాడు. మొదట బాబా గురించి తెలిసినపుడు ఇట్లాగే ఏదో సత్సంగంలోనో లేకపోతే బయట ఎక్కడో ఆయన ఫోటో చూసో, లేదా కష్టాల్లో ఉండి ఎట్లా అనుకుంటూ ఉండేటపుడు, ఎవరి సలహాతోనో మొదటిసారిగా బాబాకు దణ్ణం పెడతాడు. అయ్యా, నువ్వేదో చాలా మహిమ గలవాడివని, పిలిస్తే పలికే దైవానివనీ అంటున్నారు. మరి నాకు ఈ రకంగా అనారోగ్యంగా ఉంది. ఈ అనారోగ్యంగాని, నాకా



మనం ఎప్పుడూ గొప్ప మహాత్ముల సాన్నిధ్యంలో ఉన్నామన్న విషయం గుర్తుంచుకోవాలి. మంచి పని చేస్తే ఫలితం వందరెట్లు ఉంటుంది. తప్పుడు పని చేస్తే ఫలితం వందరెట్లు ఉంటుంది. తప్పుడు పని చేస్తే దానికి సంబంధించిన చెడు కర్మ కూడా వందరెట్లుగానే ఉంటుంది. ఎందుకంటే అది అక్కడ క్షేత్రధర్మం.



సీరియస్‌నెస్‌గాని తగ్గిపోతే నేను గురువారం రోజున ఒక పూట ఉపవాసం ఉంటాను అనుకుంటాడు. తపీమని తగ్గిపోతుంది. అబ్బో! ఈయన మహిమగల దేవుడేరోయ్ అనుకుంటాడు. బాబాకు ఒక సర్టిఫికెట్ ఇస్తాడు. సరే, ఆ తరువాత మళ్ళా ఇంకో కష్టం వస్తుంది. ఈసారి ఆయనకు ఇంకో టెస్ట్‌పెడతాడు. పాపం ఆ టెస్ట్ కూడా పాసయ్యాడు. ఆ టెస్ట్ కూడా పాస్ అయ్యేటప్పటికీ నెమ్మదిగా, ఇది బాగానే ఉంది కదా, అడగ్గానే వెంటనే అవుతుంది గనుక, మిగతాదంతా ఎందుకు వేస్ట్ కదా, ఈయన్నే పట్టుకుందామనిపిస్తుంది. సరే, ఆయననే పట్టుకోవడం మొదలుపెడతాడు. ఆయన ఫోటోనే మెయిన్‌గా పెట్టుకుంటాడు. ఆయన నామమే చేసుకుంటూ ఉంటాడు. ఇట్లా కొంతకాలానికి శిరిడీ వెళతాడు. బాబాచరిత్ర పారాయణ చేస్తుంటాడు. ఇవన్నీ చేసుకుంటూ పోతుంటాడు. కొంతకాలం పోయేటప్పటికీ బాబాభక్తుణ్ణే అనుకుంటాడు. కొన్ని కోరికలు ఇలా నెరవేరుతూ ఉంటాయి. ఒక పళాన ఏమవుతుంది? ఒక కోరిక నెరవేరదు. ఎక్కడో ఒక ఉద్యోగానికో, ఒక ప్రమోషన్‌కో, దేనికో ఒక ఇంటర్వ్యూకి వెళతాడు. వాళ్ళు నీకు ఉద్యోగం కావాలంటే ఫలానా విధంగా కాంట్రాక్ట్ వ్రాసివ్వాలి అంటారు. కాంట్రాక్ట్‌కి కూడా సిద్ధపడ్డాడు. అగ్రిమెంట్ అంతా వ్రాసిచ్చేసాడు. ఇంటర్వ్యూకి వెళ్ళి ఇదిగాని వచ్చిందనంటే ఇక నా జీవితం మూడు పువ్వులు ఆరు కాయలేను, నా పంట పండినట్లేను అనుకుంటాడు.

బాబా దగ్గరకు వెళ్ళి, శిరిడీలో ప్రదక్షిణలవీ చేసి మరీ మ్రొక్కుకొని వస్తాడు. బాబా, నిన్ను ఇంకేమీ అడగను. ఇది ఒక్కటిస్తే చాలు. ప్రతీసారీ అట్లానే అడుగుతుంటాడు. ఇదొక్కటిస్తే చాలు, ఇక నాకింకేమీ అక్కర్లేదు, ఇంకేమీ అడగను. ఇక నా సమస్యలన్నీ తీరిపోతాయి అంటాడు. సరే, ఇట్లా ఇంటర్వ్యూకి అటెండయ్యి వచ్చాడు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ కాడు. ఎంతో ప్రయత్నిస్తాడు. అంతటితో ఆగడు. మళ్ళీ రికమండేషన్లు, వ్యవహారాలు, లంచాలు ఇవన్నీ కూడా అయిపోయాయి. అయినా సెలెక్ట్ కాలేదు. మొదటిసారిగా అనుమానం వస్తుంది. ఇంతవరకు జరిగిందంతా కూడాను కొంపదీసి యాక్సిడెంటలేమో, కాకతాళీయంగా జరిగాయేమో? అన్నీ కూడా కో-ఇన్సిడెన్సేమో, ఆయన లీలలనుకొని భ్రమపడ్డానేమో? ఆయన లీలలే అయి ఉంటే ఇది కూడా కావాలి కదా. నేను ఇంతగా కోరాను కదా అని అనుమానం వస్తుంది. కొంతకాలం అలుగుతాడు, ఏం బాబా, ఇదీ, అదీ అంటాడు. సత్సంగాలకు పోడు. పెద్దగా బాబా ఫోటోకు దణ్ణం పెట్టుకోడు. కానీ భయానికి దణ్ణం పెట్టుకుంటాడు. ఇందాక నేను చెప్పిన భయానికి. ఇంకా కొంపలేమి మునిగిపోతాయోనని.



కొంతకాలమయ్యేటప్పటికీ తెలుస్తుంది ఆ పోస్టులోగానీ చేరి ఉన్నట్లయితే, ఇబ్బంది పడేవాడినని ఇంతకంటే బెటర్ పోస్టు ఇంకొకదానికి ఇంటర్వ్యూ వచ్చి, ఆ ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడానికి అవకాశం ఉంటుంది. ముందు దానిలో కనుక ఇరుక్కుపోయి ఉంటే, ఇది పోయి ఉండేది కదా అని తెలుస్తుంది. దాంట్లో సర్వీసు కోతలేవో వస్తాయి. దానిలో చేరిన వాళ్ళు కూర్చొని ఏడుస్తుంటారు. అగ్రిమెంట్ వ్రాసిచ్చారు కనుక బయటకు రాలేరు. అప్పుడు తెలుస్తుంది. దానికి వెళ్ళి ఉంటే మాత్రం మన కొంపలు మునిగిపోయి ఉండేవని. ఓహో, నాకు తెలియకుండా బాబా మేలు చేసారు. కాబట్టి, నాకు ఏది మేలో ముందు నాకు తెలియదు. ఆయనకు తెలుసు. ఇది సరే, బాగానే ఉంది. నేను అడిగింది ఇస్తున్నారు. నేను అలిగినా కూడా ఇచ్చారు. నా విశ్వాసమేమో అంతమాత్రంగానే ఉంది. కాబట్టి ముందు మన మేలు మనకు తెలియదు. మన మేలు బాబాకే తెలుసు. తెలిసినా కూడా ఆయన ఎందుకు చేయాలి? చేస్తున్నారు కాబట్టి, ఎందుకు చేస్తున్నట్టు? అనే జిజ్ఞాస, ప్రశ్న మొట్టమొదటిసారిగా ఉదయిస్తుంది. ఏదో ఒక స్థితిలో ఎవరికైనా సరే, ఆ ప్రశ్న మాత్రం ఉదయించాల్సిందే. **ఆ ప్రశ్న ఉదయించకుండా మాత్రం మనం ముందుకు పోయే అవకాశమే లేదు**. ఎందుకు? బాబా మనం అడిగిన కోరికలెందుకు తీరుస్తున్నారు? మనం చేసే పూజలకా? మనం చేసే స్తోత్రాలకా? మనం పెట్టే దణ్ణాలకా? ఆయనేమైనా రాజకీయ నాయకుడా? దణ్ణాలు పెడితే మురిసిపోవడానికి? స్తోత్రాలంటే కాకాయేగా? నువ్వంతవాడివి, నువ్వు ఇంద్రుడివి, నువ్వు చంద్రుడివి అని చెప్పి పొగడటమేగా స్తోత్రం అంటే? కాబట్టి కూర్చుని నువ్వంతటివాడివి, నువ్వింతటివాడివి అని చెబుతుంటే... అబ్బా అబ్బా అని ఇంత లావున ఉబ్బిపోతారా ఆయన? లేకపోతే మనం పెట్టే నైవేద్యాల కోసం మొహం వాచిపోయి ఉన్నారా? దేనికని? ఆ ప్రశ్న ఉదయిస్తుంది? ఈ ప్రశ్నకి వాళ్ళ వాళ్ళ మానసికమైన సంస్కారానికి అనుగుణంగా వాళ్ళకి సమాధానం దొరుకుతుంది.

కానీ, సామాన్యంగా, క్లుప్తంగా చెప్పాలంటే దానికి వచ్చినటువంటి సమాధానం ఏమిటంటే,

సద్గురు కృపాదృష్టి ప్రభావానికి లోనైన శిష్యులు గురువుచే నిరంతరం రక్షింపబడుతూ ఉంటారు. వీరు సద్గురువును విడిచిపోలేరు.





ఆయన నిష్కారణంగా, మన నుండి ఏమీ ఆశించకుండా ఆయన మనల్ని ప్రేమిస్తున్నారు అనే విషయం తెలుస్తుంది. Simply he loves అంతే. ఏమీ కారణం లేదు, అందుకోసం కాదు. ఇందు కోసం కాదు. మన క్వాలిఫికేషన్స్ చూసి కాదు. మనల్ని మనలుగా చూసి ప్రేమిస్తున్నారు. మన క్వాలిఫికేషన్స్ చూసి కాదు. మన నుండి ఏమీ ఆశించి కాదు. **నన్ను నన్నుగా ప్రేమించుటకు ప్రతీ మనిషిలో ఉండేటువంటి తపన, కోరిక అది.** మన నుండి ఏమీ ఆశించకుండా మన క్వాలిఫికేషన్స్ చూడకుండా, దేనినీ పట్టించుకోకుండా మనల్ని ప్రేమించాలి. ఆ వ్యక్తి కోసం మనం తపన పడుతుంటాం. ఆయన మనలను ప్రేమిస్తున్నారు. ఎందుకు ప్రేమిస్తున్నారు? సమాధానం బాగా అందంగా ఉంది. వినేదానికి సొంపుగా ఉన్నది. అసలు ఎందుకు ప్రేమించాలి అని? నన్ను నన్నుగా, క్వాలిఫికేషన్స్ ఏమీ లేకుండా ఊరికినే ప్రేమిస్తూ ఉండటం ఎందుకని? ఆయన చరిత్ర చదివితే ఒక విషయం అర్థమవుతుంది. సకల సృష్టి ఆయనకు తన రూపంగా అనుభవమై ఉంది. ఎవరి అనుభవాన్ని గురించైనా చెప్పేటప్పుడు **'నేను'** అని చెప్పేవారాయన. కుక్కని కొడితే నన్ను కొట్టావనేవారు. కుక్కకు రొట్టెముక్క పెడితే నాకు రొట్టెముక్క పెట్టావనేవారు. బర్రెగొడ్డు మీద దెబ్బ పడితే తన ఒంటి మీద దెబ్బ చూపించేవారు. ఇంక ఎవరికో ఏదో అనుభవం జరిగితే నేను ఇట్లా వెళ్ళాను, నేను ఇట్లా చేసాను, నన్ను వాడట్లా అన్నాడు. నన్నిట్లా చేసాడు అని చెప్పేవారాయన. అంతే తప్పితే వాడు ఇట్లా చేసాడు అనేవారు కాదు.

అందరి జీవుల్లోనూ ఉండేటువంటిది తానేనూ అనేటువంటి అనుభవాన్ని పొంది ఉన్నారాయన. మనిషి అందరికంటే ఎక్కువగా ప్రేమించేది ఎవరిని అంటే, నిష్కారణంగా మళ్ళా తనను తానే! అందరికంటే ఎక్కువ మనకు ప్రీతికరమైనది ఏదీ అంటే మనమే! ఫస్ట్ మనం, ఆ తరువాతే ఇంక ఏదన్నా ఇష్టం. అది వేరే విషయం. కాబట్టి మనందరిలోనూ ఉండేటువంటి ఆ 'నేను' అనేటువంటి తత్త్వం ఆయనే అనే అనుభవంలో ఆయన ఉన్నారు కనుక మనల్ని నిష్కారణంగా ప్రేమించడం ఆయనకు సాధ్యం. అది మనకు తెలుస్తుంది. తెలియడం మొదలుపెట్టిన తరువాత ఏమవుతుంది? అందరి జీవులలోనూ ఉండేటువంటిది బాబానే. ఒక మనిషి పట్ల విపరీతమైనటువంటి మమకారం, ఇంకో మనిషి పట్ల ద్వేషం, కక్ష, కార్పణ్యం...అవి తెలియకుండానే మనలో (మనలోనే) తగ్గిపోతూ వస్తాయి. ఎందుకని? ప్రేమని అనుభవించినటువంటివాడు, ప్రేమను పొందాలని చూస్తాడు. ఎవడికి



ఈ కక్ష, కార్పణ్యాలు, ఇవన్నీ ఉంటాయనంటే, ప్రేమని అనుభవించనటువంటివాడికే ఉంటాయి. ప్రేమను ఒక్కసారి, నిజమైన ప్రేమని ఎవరన్నాగానీ అనుభవించారంటే మాత్రం వాడు ఇంకో మనిషిని ద్వేషించలేడు. నిజమైన ప్రేమ... దానికోసం ఏమైనా చేయాలి అనేటువంటి ఆ తపన ఉండేటువంటి ఆ ప్రేమ.

మనిషి ఆ ప్రేమనుగానీ అనుభవించాడు అంటే, ఇక ఎవ్వరినీ ద్వేషించడం ఉండదు. వాడిలో ఉండేటువంటి ఆ ద్వేషము, కక్ష, రివెంజ్ ఇవన్నీ కూడా తుడిచిపెట్టుకుపోతాయి. అటువంటివాడే ప్రేమించడానికి, ప్రేమించబడటానికి కూడా అర్హుడు. వాడు ప్రేమించబడుతున్నాడు, ప్రేమించలేకపోతున్నాడు, వాడు ఇంకా దౌర్భాగ్యుడు. కాబట్టి, ఈ ఫీలింగ్స్ నేను చెప్పేటువంటి మాటల రూపంలో రాకపోయినప్పటికీ కూడాను, ఇవి మనకు లోపల తెలియకుండానే జరుగుతాయి. అప్పుడు ఆయన యొక్క ప్రేమను గుర్తించి, ఇక నా గురించి నేనేమీ ఆలోచించాల్సిన అవసరం లేదు, నా గురించి ఆయనే చక్కగా ఆలోచించగలరు. ఎందుకంటే నాలో ఉండే 'నేను' యొక్క శ్రేయస్సు గురించి ఆయనే ఎక్కువ తాపత్రయపడతారు అని మనం ఎప్పుడైతే గుర్తించామో, మనం ఏ విషయాన్ని గురించైనా తాపత్రయపడటం మానేస్తాం. ఆనందంగా ఉంటాం. అట్లా ఆనందంగా ఉండి, ఏ బాదరబందీ పెట్టుకోకుండా, మనస్సులో... బాదరబందీ అంటే బాహ్యంగా మనం అన్ని పనులు వదిలిపెట్టాలని కదా నేను చెప్పేది. ఆ లోపల ఉండేటువంటి అనవసరమైన వర్రీ, అనవసరమైన తాపత్రయం, టెన్షన్స్, యాంక్సయిటీ ఇవేవి లేకుండా అన్నీ బాబా చూసుకుంటారు. మనం మామూలుగా చెయ్యాల్సిన ప్రయత్నం అంతా కూడా మనం చేస్తుంటాం. ప్రయత్నం వరకు చేస్తుంటాం. లోపల టెన్షన్ ఉండదు, లోపల ఆనందం ఉంటుంది. ఎంత సీరియస్ ప్రాబ్లం గురించి ప్రయత్నం చేస్తున్నా ప్రయత్నంలో లోపం ఉండదు. లోపల మనస్సుకి ఆనందంగా ఉంటుంది ఇలా ఉంటూ, ఎటువంటి బాదరబందీ లేకుండా ఉండటమే 'శరణాగతి'. "నాకు పగ్గాలు అప్పగించు, నిన్ను చివరికంటా గమ్యం నేను చేరుస్తా" అన్నారు బాబా. – శ్రీబాబూజీ



మనలో అవ్యక్తంగా, అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వ భావనకు ఓ నిర్దుష్టమైన రూపునిచ్చి, దానిని అనుభవపూర్వకంగా 'వాస్తవం' చేసుకోవడమే మన ఆధ్యాత్మిక ప్రాపంచిక లక్ష్యాలకు మూలం, సారం.



# గురుకృపాలహరి

"సత్యమార్గం నుండి మరలవద్దు, ధర్మమార్గాన్ని విడవద్దు, ఆత్మ సంరక్షణ నుండి మరల వద్దు, స్వాధ్యాయ ప్రవచనాల నుండి మరలవద్దు. దేవ, పితృకర్మల నుండి మరలిపోకుండా తల్లి, తండ్రీ, గురువు, అతిధులను దైవ సమానులుగా తలచి పూజించు" అంటుంది తైత్తరీయోపనిషత్తు. ధర్మానికి ఆకారంగా, శాస్త్రాలకు ఆధారంగా వెలుగును పంచాయి మహాత్ముల జీవితాలు... త్యాగము ద్వారానే అమృతత్వం సిద్ధిస్తుందన్న శృతి వాక్యానికి వ్యాఖ్యానంగా వారి జీవితాలు శోభిల్లాయి. అట్టి మహితాత్ములలో నిత్య స్మరణీయులు శ్రీపరమాచార్యస్వామి. తమ జీవితమంతా ధర్మాచరణము, గురువు చూపిన బాటలో సాగిన కర్మాచరణము ఇవి రెండు మాత్రమే కానవస్తాయి.

జాతిహితము కోసం తమ దేహమునే యజ్ఞవాటికగా చేసి తమ జ్ఞానమనే హవిస్సుతో ప్రతీ మనిషిని దైవంగా నడిపిస్తూ ఎవరైతే తమ అస్తిత్వాన్ని గురుచరణాల చెంత సమర్పించారో వారిని సమిధలుగా దైవ సన్నిధిని చేర్చిన పురాణ పురుషులు జగద్గురువులు. తమ జీవితంలో ప్రతీ అడుగు ధర్మాచరణకు కట్టిన పట్టమే.. నేర్చుకోవాలనే జీవులకు వారి ఆదర్శాలు పవిత్ర గంగా స్నాన ఘట్టమే! అన్నింటిని శాసించగల ఆ పవిత్రాత్ములు తమ దేహానికి వచ్చేసరికి మాత్రం నిస్సంగులై జీవిస్తారని చరిత్ర చెప్పే పాఠం. దేహాతీతులకు దేహం యొక్క స్ఫురణ ఎక్కడిది? సమత, మమత, మహిత, ఘనత ఏకమై ప్రభవించిన పూర్ణానుగ్రహరూపులకు దేహచింతన ఎక్కడిది? జగత్ హితమే కానీ స్వహితమెరుగని అమృత స్వరూపాన్ని దర్శించుకొనే అవకాశం మా గురుదేవులు పూజ్య శ్రీబాబూజీ రూపంలోనూ లభించింది. పరమాచార్యస్వామి వారి ఆశీస్సులు పొందిన సత్ప్రేమమూర్తి వారు. ఎన్నో సామ్యాలు – ఇద్దరు స్వాములలో. ఒకరు సన్యాసాశ్రమ చుక్కాని–మరొకరు గృహస్థాశ్రమ స్ఫూర్తి. దారులు వేరుగా అన్పించినా – గమ్యం మాత్రం దైవాన్ని అందరి దరికి చేర్చే 'ప్రయత్నం' – చీకట్లను తొలగించిన అనుగ్రహ 'గురుత్వం'. ఇక మన కంచి కథలోకి వెళ్ళే ప్రయత్నం చేద్దాం.

1955వ సం. డిసెంబరులో కాంచీపురంలో విడిది చేస్తున్న స్వామివారికి అనారోగ్యం చేసింది. స్వామివారు తమ ఛాతీ భాగంలో ఎంతో నొప్పికి గురి అయ్యారు. నొప్పి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వైద్యులు చేసిన పరీక్షలలో రక్తపోటు తగ్గిపోవడం వల్ల **(Low Blood Pressure)** వారికి గుండెపోటు వచ్చిందని గుర్తించారు. స్వామివారికి పూర్తి స్థాయి విశ్రాంతి అవసరమని సూచించారు వైద్యులు. ఎప్పటిలాగే వారి అభిమతం మాత్రం తమ పూజాదికాలు, ఆశ్రితుల విన్నపాల



స్వీకరణ, అవసరార్థం వచ్చే సాధకుల సందేహ నివృత్తి. చాలా గట్టిగా వ్యతిరేకించారు స్వామి విశ్రాంతి తీసుకోవడానికి. కళ్ళనీళ్ళ పర్యంతమైన బిడ్డలందరి ముఖాలు చూసో, ఈశ్వర సంకల్పమో తెలియదు గానీ జయేంద్ర సరస్వతీ స్వామివారు ఆ కార్యక్రమాలు చేయడానికి పరమాచార్యస్వామి ఒప్పుకోవడంతో మూడు మైళ్ళ దూరంలోని శివాలయానికి స్వామివారి విడిదిని మార్చి వారిని ఏకాంతంలో ఉండమని అర్థించి వారి అనుమతి పొందడంలో కృతకృత్యులయ్యారు అంతేవాసులు. పర్యవేక్షక వైద్యులు డా॥ మహాలింగంగారు పదిహేను రోజులు విశ్రాంతిని సూచించడం, రక్తపోటు తక్కువగా ఉన్నా, నాడి సరిగ్గానే పని చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు అందరూ!

**మహాత్ములు, రూపాతీతులే అయినా ఆ రూపంతో ఉండే అనుబంధం మాటల్లో చెప్పగలిగిందా! ఎందుకంటే ఆ రూపమే కదా అపారమైన ఆ తత్త్వానికి ఆలంబన. అప్పుడే కదా మనిషి వారిని ఆశ్రయించుకుని అవగలడు నివేదన.... గురువును గుండె గుడిలో పెట్టుకుందాం.... రాబోయే సంచికలో మళ్ళీ కలుద్దాం... సద్గురు చరణ దర్శన ప్రాప్తిరస్తు... శుభం భవతు... – గురుకృప**

అపాద మస్తక సమస్తం పునీతమయ్యే
ఆ సద్గురు పద కమలార్చనకు కూర్చిన
అక్షర 'అచ్చులు'



అపర ధనవంతుడైన ఆ సద్గురు పరాధన నిధాన సమాశ్రయంలో పొందిన
శ్రేయాశ్రేయ విచక్షణా నివేదనే... **అసలైన ఆరాధన...**

ఆశ్రిత జన సముద్ధరణా సమర్థుడైన ఆ సద్గురు శిక్షణలో పరివర్తన నొందిన
ఆలోచనా సంవిధాన నివేదనే... **అసలైన ఆరాధన...**

ఇహమునే పరమపథ యానముగా మార్చే సాయిపథ జీవన విధాన
పురోగమన నివేదికా నివేదనే... **అసలైన ఆరాధన...**

ఈతి బాధల పోరులో అలసిన ప్రతి మనసున ప్రేమను నిగిడించిన
ఆ సన్నిధానాన పెల్లుబికే ఆనందానుభవ నివేదనే... **అసలైన ఆరాధన...**

ఉత్తమాటల వచో వైభవానికన్నా గట్టిచేతల ఆచరణే
ప్రామాణికమన్న గురుప్రబోధాచరణే ... అదే **అసలైన ఆరాధన...**

**ఊ**రకుండమన్న బోధ వినక తెచ్చిపెట్టుకున్న బాధల వెనుక
వెలిగిన వివేకవైరాగ్య నివేదనే.. **అసలైన ఆరాధన...**

**ఋ**ణానుబంధమంటే లెక్కలకు అందని అందమైన భాంధవ్యమంటూ దరి చేరిన
అందరినీ చేరదీసి, దారి చూపిన ఆ అపార కరుణకు కరిగిపోయిన
కడుకు మనసుల ప్రేమాస్పద ప్రతిస్పందనే ... **అసలైన ఆరాధన...**

**ౠ**కలు ఖర్చు పెట్టమని కేకలు వస్తున్నాయి అన్న సూచనలో
అంతర్లీనమైన గురుచరణ  శరణాగతికి మించిన భద్రత లేదన్న సత్యం
తాలూకు అవగాహనే... **అసలైన ఆరాధన...**

**ఎ**దలోని ఎడబాటునంతా ఎలుగెత్తి పిలిచే సాయినామంతో వ్యక్తం చేస్తూ
పొందే తన్మయానంద రసరూప ఆస్వాదనే... **అసలైన ఆరాధన...**

**ఏ**మైనా కానీ గురువును అంటిపెట్టుకోమన్న బాబా బాటలో పురోగమిస్తూ
సద్గురు పద సన్నిధికి పునరంకితమవ్వడమే... **అసలైన ఆరాధన...**

**ఐ**దున్నర అడుగుల దేహం కాదు సద్గురువంటే అని ప్రబోధించిన
ఆ సన్నిధి సాక్షిగా సాగే అగాధ తత్వాన్వేషణే... **అసలైన ఆరాధన...**

**ఒ**కానొక దైవం కాదు, బాబాయే నా దైవం అన్న విస్పష్టమైన విశ్వాసాన్ని
పాదుగొల్పిన ఆ విశిష్ట సద్గురు పద కమలార్చనే... **అసలైన ఆరాధన...**

**ఓ**టమి అంటే విలువల పతనమేనంటూ, ఆదర్శాల రహదారిలో నిఖార్సైన
నిదర్శనంగా నిలిచిన ఆ దార్శనికత దర్శనమే... **అసలైన ఆరాధన...**

**ఔ**నని కాదని కూడదనే వాదాలు బేధాలు ఖేదాలకు తావులేని
ప్రేమ, ఓరిమి, కూరిమిల బలిమితో కూడిన
గురుభక్త సమూహ సాధనే... **అసలైన ఆరాధన...**

**అం**తులేని ఆనందరసార్ణవ యానమే గమ్యంగా సాగే ఆధ్యాత్మిక సాధనా
ప్రస్థానమున దీపస్థంభంగా  వెలిగే సద్గురు అధిష్టానంలో
ఆరున్నొక్క రోజుల విశేష అనుష్టానమే ... **అసలైన ఆరాధన...**

**అః**హంకారమనే భస్మాసుర స్వీయహస్తం బారిన పడకుండా కాపాడే ఆ
సద్గురు పద ముద్రలు శిరస్సుపై ప్రతిష్ఠించుకోవడమే... **అసలైన ఆరాధన...**


- శేఖర్, చెన్నై

నేను ప్రయత్నం చేస్తాను. బాబాను బాబాగా చూడండి. ఎలా ఉన్నా బాబానే. కూర్చొనే దానికి అర్థాలు లేవా? ఉండవచ్చేమో, మనకు అవసరమైతే ఆయన చెప్పరూ! ఆయన చెప్పలేదంటే మనకనవసరమైన విషయం అది. అనవసరమైన విషయాల గురించి మనకెందుకు? బాబా ధుని వేసుకున్నారు. బాబా అగ్నిహోత్రం చేసారు. అని చెప్తే మనకు తృప్తి. బాబా అగ్నిహోత్రం ఏం చేయలేదు. ఆయన వైదిక చర్యలేమీ చెయ్యలేదు. వేదంలో అగ్ని పవిత్రం. అగ్నిని పూజ చేస్తారు. బాబా ఏ రోజునా అగ్నిని పూజ చేయలేదు. మంట పైకెక్కితే, "ఏయ్, తగ్గు" అన్నారు కర్రపెట్టి. ఒక సర్వెంట్‌ను చూసినట్టుగనే, 'తగ్గు' అన్నారంతే, కర్రపెట్టి చూపించి, కొట్టినట్టుగానే. తగ్గింది. ఆయన మసీదులో రాత్రయితే బయటకుపోయేవారు కాదు. ఎప్పుడన్నా ఆయనకు ఆరోగ్యం బాగాలేక లెట్రిన్‌కి పోవాల్సివస్తే లెండీదాకా పోయేవారు కాదు. మసీదులోనే కూర్చునేవారు. ఎక్కడ కూర్చునేవారు? ధుని ప్రక్కన కూర్చుని, ఆ బూడిదతో దాన్ని కప్పేసేవారు. మంటను సరిచేసేటపుడు కాలితో సరిచేసేవారు. ఇది వైదిక చర్యా? మనకు, అట్లా ఆలోచించడం ఇష్టం ఉండదు. బాబా వైదికుడు అనుకోవడం మనకిష్టం. అందుకని బాబా నిత్యాగ్నిహోత్రి అని చెప్తే అదొక satisfaction. నేనేమంటానంటే, అది కరెక్ట్ కాదు. బాబా అగ్నిహోత్రం చేసినా, చేయకపోయినా, ధుని వేసినా, వేయకపోయినా బాబా బాబానే. ఆయన ఏమి చేసినా, నాకు సంతోషమే. ఆయన చేసిన ప్రతి ఒక్కటీ నాకు లీలే. అది మన యాటిట్యూడ్‌గా ఉండాలి.

– శ్రీబాబూజీ



శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ కీ జై!!




# గురువాక్కే గురుకృప!

సద్గురువు ఉపదేశాన్ని అనుసరించడమే సద్గతి. గురువాక్కును లేదా గురువాక్యాన్ని ఆజన్మ దీక్షగా గైకొని తరించడం సులభమైన మార్గం. దుర్లభమైనవి సులభంగా జరగడం "గురుకృప" వలన సాధ్యం. ఇది త్రికరణశుద్ధి గల భక్త సాధకులకు స్వానుభవం. గురుతత్త్వం, గురూపదేశం, గురుబోధ అనేవి సాధకులను క్రమశః సంస్కరించి, వారిని కర్తవ్యోన్ముఖులుగా, జీవన్ముక్తులుగా తీర్చిదిద్దుతాయి. గమ్యం చేరడానికి, చరితార్థతనొందడానికి సద్గురు స్పర్శ, సాన్నిధ్యం ఎంతో దోహదపడతాయి.

www gurukrupa.info | +91 83672 00045